www.bharathasakthi.com

# భారత శక్తి ®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

| సంపుటి : 21 | సంచిక : 20 | హైదరాబాద్ | బుధవారం,జూన్ 24 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00 |
|---|---|---|---|---|---|

## 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై
# వేటు వేసిన మమతా బెనర్జీ



తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తార స్థాయికి చేరింది. 1998లో పార్టీని స్థాపించి, దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యంగా నడిపిస్తున్న అధినేత్రి మమతా బెనర్జీ స్థానంలో కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తూ రెబల్ వర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనికి రివర్స్ కౌంటర్‌గా మమతా బెనర్జీ 8 మంది రెబల్ ఎమ్మెల్యేలపై వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన మాజీ రైట్ హ్యాండ్, మాజీ మంత్రి ఫిర్హాద్ హకీమ్‌తో పాటు మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పార్టీ నుంచి మమత శాశ్వతంగా బహిష్కరించారు.

2లో..

## హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో
# ఆయిల్ రవాణా: ట్రంప్ ప్రకటన

- హర్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెల్ల ఆయిల్ రవాణా
- ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్
- ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు



అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని

2లో..

# ధరణి నుండి భూ భారతి దాకా
# లోపాల పుట్టే..!




- సాంకేతికత ఉన్నా తప్పని అవకతవకలు
- రాయదుర్గంలో ఎకరం రూ. 237
- కోట్లురియల్ ఎస్టేట్ మాయాజాలంలో నలిగిపోతున్న భూమిపుత్రులు
- నకిలీల అడ్డాగా మారిన ఐటీ హబ్
- ఐటీ కారిడార్‌లో వివాదాల సుడిగుండం




పాలకులు మారినా, రంగులు మార్చినా ప్రభుత్వాల 'భూ'ప్రహసనం మరియు దందా మాత్రం మారడం లేదు! నిన్న 'ధరణి' అని ఊదరగొట్టారు, నేడు 'భూ భారతి' అంటూ సరికొత్త డిజిటల్ పల్లవి అందుకున్నారు, తీరా చూస్తే పారదర్శకత ఎక్కడయ్యా అంటే సమాధానమే లేదు. సాంకేతికతతో అద్భుతాలు చేస్తామంటూ, శాఖల మధ్య కనీస సమన్వయం లేక తప్పుల తడకల రికార్డులతో సరికొత్త లోపాలను తెరపైకి తెస్తున్నారు. ఒకవైపు రాయదుర్గంలో ఎకరం ఏకంగా రూ. 237 కోట్లు పలుకుతూ రియల్ ఎస్టేట్ మాయాజాలం సృష్టిస్తుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో భూమిపుత్రుల ఆర్థిక వ్యవస్థ మాత్రం కుప్పకూలిపోతోంది. ఒక సాదాసీదా వేలం కాస్తా అంతర్జాతీయ పెట్టుబడులకు విఘాతం కలిగిస్తూ, చట్టపరమైన సంక్లిష్ట వివాదంగా మారి నేడు ప్రభుత్వానికి పెను సవాల్‌గా నిలిచింది. ఇది ముమ్మాటికీ మన పాలకుల అస్తవ్యస్త 'భూ'పాలన మహత్యం!

2లో..

## 2026 సంవత్సరానికి సంబంధించిన
# పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం



**విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, (భారత శక్తి)** :2026 సంవత్సరానికి సంబంధించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం ఈరోజు (జూన్ 23, 2026) ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 131 పద్మ పురస్కారాలను ప్రకటించగా వీటిలో మొదటి విడత పురస్కారాల ప్రదానోత్సవం మే 25న నిర్వహించారు. కాగా రెండో విడత పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా అవార్డు గ్రహీతలకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము అవార్డులను అందజేశారు.

**అవార్డు గ్రహీతల్లో కొందరు ప్రముఖుల వివరాలు.**

పద్మ విభూషణ్: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్ (ప్రజా వ్యవహారాలు), ప్రముఖ మలయాళ పాత్రికేయులు పి. నారాయణన్ (సాహిత్యం & విద్య) రంగాల్లో ఈ పురస్కారం అందుకున్నారు.

3లో..

## న్యాయమూర్తుల నియామకంలో
# జోక్యం చేసుకోలేం
- సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ(భారత శక్తి)** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంలు తీసుకునే నిర్ణయాల్లో న్యాయపరంగా జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం సీనియారిటీ ఉన్నంత మాత్రాన జడ్జిగా పదోన్నతి పొందడం హక్కుగా మారదని తేల్చిచెప్పింది. తనకంటే జూనియర్లకు హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించడాన్ని సవాలు చేస్తూ హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం

2లో..

## కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ చర్చలు
# విజయవంతం



**న్యూఢిల్లీ(భారత శక్తి)** హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం.. ఫేజ్-2 విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి గారు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎ స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులపాటు చర్చలు విజయవంతమయ్యాయి. మొదట సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో సుదీర్ఘంగా చర్చించారు. ఈరోజు ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ గతో, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి , ముఖ్యమంత్రిశ్రీ రేవంత్ రెడ్డి ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- ఎ వాల్యుయేషన్,

2లో..

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా..
## దాని వెనుక స్కాం ఉంటుంది



**హైదరాబాద్ (భారత శక్తి)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ. 30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ. 14 వేల కోట్ల భారం

2లో..

## దేశ రాజధాని ఢిల్లీని ముంచెత్తిన
# దుమ్ము తుపాను

- గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- పలు ప్రాంతాలకు ఐఎండీ ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ
- ఎండవేడి నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**హైదరాబాద్ (భారత శక్తి)** దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం మధ్యాహ్నం గురుగ్రామ్ సహా ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని పలు ప్రాంతాలను తీవ్రమైన దుమ్ము తుపాను ముంచెత్తింది. దీని ప్రభావంతో దట్టమైన ధూళి మేఘాలు కమ్ముకోవడమే కాకుండా, బలమైన ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురవడంతో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ దుమ్ము తుపాను కారణంగా పలు ప్రాంతాల్లో ఎదురుగా ఉన్నవి కూడా కనిపించలేదు. గురుగ్రామ్‌లో ప్రారంభమైన ఈ తుపాను క్రమంగా ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్ పరిసర ప్రాంతాలకు విస్తరించింది. భారత వాతావరణ శాఖ

2లో..

## భారతదేశ అసలు సిసలైన హీరో
# శ్యామాప్రసాద్ ముఖర్జీ
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ (భారత శక్తి)** కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశం కోసం యుద్ధం చేయడానికి జన సంఘ్ కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడుపార్టీ, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత. దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షుడుశ్యామాప్రసాద్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం.

2లో..

## సింగరేణిని కుంభకోణాల
# గనిగా మార్చారు
- మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు




**భద్రాద్రి కొత్తగూడెం,(భారత శక్తి) :** కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో సింగరేణి పూర్తిగా నిర్వీర్యం అవుతోందని, 137 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితికి చేరుకుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ కాస్ట్ ఓబీ (ఓవర్ బర్డెన్) టెండర్లలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. సైట్ విజిట్ పేరుతో సరికొత్త నాటకానికి తెరలేపి, ఓబీ టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఉప

2లో..

# ధరణి నుండి భూ భారతి దాకా లోపాల పుట్టే..!

**హైదరాబాద్ జూన్ 22(భారత శక్తి ప్రతినిధి):** రాష్ట్రంలో భూ వ్యవహారాలు ప్రభుత్వాలకు పెను సవాల్‌గా మారుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వరకు, పాలకులు మారుతున్నా భూ దందాలు, అక్రమాలకు మాత్రం బ్రేక్ పడటం లేదు. గత ప్రభుత్వ హయాంలోని లోపాలు, ప్రస్తుత ప్రజాపాలనలోనూ కొనసాగుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.




### 'ధరణి' పోయె.. 'భూ భారతి' వచ్చె.. కానీ పారదర్శకత ఎక్కడ?

భూ రికార్డులను ప్రక్షాళన చేసి, పారదర్శకత తీసుకువస్తామంటూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లలో తీవ్ర లోపాలతో విఫలమైంది. మధ్యవర్తుల లీలలు, అధికారుల విచక్షణారహిత నిర్ణయాల వల్ల సామాన్యులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తాజాగా ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో కొత్త వ్యవస్థను తెచ్చినా, భూ సర్వేలు చేస్తున్నామని ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదు.




ఇటీవల జరిగిన ఎస్బీఐ భూ వ్యవహారమే దీనికి నిదర్శనం. డిజిటల్ యుగంలో కూడా టిజిఐఐసి (౧+××జ), రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో ప్రభుత్వం తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది.

### మూడు దశాబ్దాల దక్కన్ దోపిడీ.. కుప్పకూలిన 'భూమిపుత్రుల' ఆర్థిక వ్యవస్థ!

గడిచిన ముప్పై ఏళ్లలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిధిలోని భూముల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. నాటి సమైక్య పాలకుల వ్యూహాత్మక మార్పుల వల్ల రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, గచ్చిబౌలి, కోకాపేట్, నెన్నాంపూర్, నానక్‌రాంగూడ, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, మియాపూర్, రాయదుర్గం వంటి ప్రాంతాలు ఐటీ, పారిశ్రామిక హబ్‌లుగా అవతరించాయి.అయితే, ఈ భూ అద్భుతం వెనుక స్థానిక భూమిపుత్రుల కన్నీళ్లు దాగి ఉన్నాయి. ఒకప్పుడు వ్యవసాయమే జీవనాధారంగా బతికిన రైతుల భూములను ఆదాయ వనరుగా మార్చుకుని, కార్పొరేట్ శక్తులు పడగలెత్తాయి. ఇటీవల రాయదుర్గంలో ఒక ఎకరం భూమి ఏకంగా రూ. 237 కోట్లు పలికిందంటే ఇక్కడి భూముల మాయాజాలం మరియు రియల్ ఎస్టేట్ మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

### రాయదుర్గం 'నాలెడ్జ్ సిటీ' వివాదం: అంతర్జాతీయ పెట్టుబడులకు బ్రేక్?

మొదట్లో ఒక సాధారణ ప్రభుత్వ భూ వేలం లాగా ప్రారంభమైన రాయదుర్గం నాలెడ్జ్ సిటీ వ్యవహారం, ఇప్పుడు హక్కులు, సంస్థాగత అధికారాలు మరియు చట్టపరమైన చిక్కులతో అత్యంత సంక్లిష్టమైన వివాదంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 నగరాల నుండి ఈ ప్రాంతానికి పెట్టుబడులు వస్తున్న తరుణంలో.. హెచ్-1బీ (H-1B) వీసా ఆంక్షలు, గల్ఫ్ యుద్ధ నేపథ్యం కారణంగా పెట్టుబడుదారులలో ఒక రకమైన ఆందోళన మొదలైంది. ఈ అంతర్జాతీయ పరిణామాలు




హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

### 'భారత శక్తి' డిమాండ్: ప్రభుత్వానికి పెను సవాల్!

భూ వ్యవహారాలు అనేవి కేవలం కొన్ని సర్వే నంబర్లకు సంబంధించినవి కావు. అవి పరిపాలన, ఆర్థిక, సామాజిక, సాంకేతిక, మరియు రాజకీయ అంశాలతో ముడిపడి ఉన్న సున్నితమైన సవాల్. ఇప్పటికైనా ప్రభుత్వం శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, సాంకేతికతలోని లోపాలను సరిదిద్ది, నిజమైన పారదర్శకతను నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎల్లంపేట గ్రామంలో పర్యటించి, పల్లె దవాఖాన, వనమహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 23: జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా గ్రామంలోని పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్, అవుట్ పేషంట్ (ఓపీ) రిజిస్టర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అనంతరం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఎల్లంపేట గ్రామానికి చెందిన శ్రీమతి బుద్ది నవీన (భర్త: స్వామి)ను అభినందించి, ప్రభుత్వం తరఫున గుర్తింపుగా గోడ గడియారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పరిశుభ్రత పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు

### తనిఖీల్లో పలు లోపాలు గుర్తించిన ఆహార భద్రతా అధికారి




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 23: వర్షాకాలంలో వాహక జనిత అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలోని నూతన బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీల సందర్భంగా కొన్ని ఆహార వ్యాపార సంస్థల్లో మూతలు లేకుండా ఆహార పదార్థాలను నిల్వ చేయడం, అపరిశుభ్రమైన వంటశాలలు నిర్వహించడం, ఆహార తయారీ సిబ్బందికి ఆరోగ్య ధృవపత్రాలు లేకపోవడం, గ్లౌజులు, హెడ్ క్యాప్‌లు ధరించకపోవడం వంటి లోపాలు గుర్తించారు. సంబంధిత యాజమాన్యాలకు వెంటనే లోపాలను సరిదిద్దాలని సూచించారు.వర్షాకాలంలో దోమలు, ఈగలు వంటి వాహకాల ద్వారా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆహార భద్రతా అధికారి హెచ్చరించారు.

### ఈ సందర్భంగా ఆయన జారీ చేసిన ముఖ్య సూచనలు:

- హోటల్, రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమలు, ఈగలు వంటివి ఆహార పదార్థాల వద్ద చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఆహార పదార్థాలను తప్పనిసరిగా మూతలతో భద్రపరచాలి.
- సురక్షితమైన, శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే వినియోగించాలి.
- వంట, వడ్డన సిబ్బంది పరిశుభ్రమైన దుస్తులు, గ్లౌజులు, హెడ్ క్యాప్‌లు ధరించాలి.
- చెత్తను ప్రతిరోజూ మూత ఉన్న డస్ట్‌బిన్‌లలో సేకరించి సకాలంలో తొలగించాలి.

నిర్దేశించిన ఆహార భద్రతా ప్రమాణాలను పాటించని సంస్థలపై ఆహార భద్రతా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా అధికారి శ్రీ జి. విక్రమ్ హెచ్చరించారు.

# చేయూత పింఛన్ లబ్ధిదారుల లైవ్‌నెస్ ఆథెంటికేషన్ గడువు 27 వరకు పొడిగింపు

**- బడంగ్పేట్ సర్కిల్ కార్యాలయంలో కేవైసీ పూర్తి చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ వెల్లడి**

**బడంగ్పేట్, జూన్ 23 (భారత శక్తి):** చేయూత పథకం కింద బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల లైవ్‌నెస్ ఆథెంటికేషన్ (కేవైసీ) గడువును ఈ నెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు బడంగ్పేట్ సర్కిల్--16 డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

### కార్యాలయంలోనే ఆథెంటికేషన్ ప్రక్రియ

బడంగ్పేట్ సర్కిల్ పరిధిలో బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్లు పొందుతున్న అన్ని వర్గాల చేయూత పింఛన్ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు. లబ్ధిదారులందరూ బడంగ్పేట్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి తమ లైవ్‌నెస్ ఆథెంటికేషన్‌ను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు.

### గడువు దాటితే పింఛన్ నిలిచే ప్రమాదం

నిర్ణీత గడువులోపు లైవ్‌నెస్ ఆథెంటికేషన్ పూర్తి చేయని పక్షంలో పింఛన్ చెల్లింపుల్లో జాప్యం లేదా అంతరాయం కలిగే అవకాశం ఉందని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు. అందువల్ల ప్రతి లబ్ధిదారుడు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, వెంటనే తమ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 వరి రకాలను సాగు చేసి బోనస్ పొందాలి.

**- యూరియా కొరతపై ఆందోళన అవసరం లేదు**

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 23: పాల్వంచ మండలం ఎలుపు గొండలో యూరియా కేంద్రం పరిశీలించారు.రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బీపీటీ-5204, డబ్ల్యూజీఎల్-44, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, హెచ్ఎంటీ, జై శ్రీరామ్ వరి రకాలను సాగు చేసి ప్రభుత్వ బోనస్‌ను పొందాలని సూచించారు.యూరియా పంపిణీపై మాట్లాడుతూ, రైతులు యూరియాను ప్రత్యేక యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని తెలిపారు. యాప్‌లో బుక్ చేసిన అనంతరం రెండు రోజుల వరకు ఎరువుల బస్తాలను పొందే అవకాశం ఉంటుందని, రైతులు ఆందోళన చెందకుండా అవసరమైన సమయంలో బుకింగ్ చేసుకోవాలని సూచించారు.రైతులు ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు మట్టిలో తగిన తేమ (పదును) ఏర్పడిన తర్వాతే విత్తనాలు వేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. తొందరపడి విత్తనాలు చల్లకుండా, పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు మరియు స్వల్పకాలిక పంట రకాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్, అదనపు జిల్లా వ్యవసాయ అధికారి (ఏడీఏ) అపర్ణ పాల్గొన్నారు.తహసీల్దార్ సరళాభాయి, ఎంపీడీవో గోపిబాబు, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి రవి, ఎల్లంపేట గ్రామ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా: ట్రంప్ ప్రకటన

తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు. ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

## న్యాయమూర్తుల నియామకంలో జోక్యం చేసుకోలేం

తోసిపుచ్చింది. సోమవారం విచారించిన ధర్మాసనం, కొలీజియం నిర్ణయాలపై విచారణ జరిపి కొత్త వివాదాలకు తాము తెరతీయదలచుకోలేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు ఇంకా పదేళ్ల సర్వీసు ఉన్నందున ఓపిక పట్టాలని,భవిష్యత్తులో అవకాశం రావొచ్చని సూచించింది.

# భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ

370 ఆర్టికల్ రద్దు,మేక్ ఇన్ ఇండియా,స్టార్టప్ ఇండియా ముఖర్జీ ఆకాంక్షలేదళారీ వ్యవస్థ లేకుండా లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నాంకేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి..భారతదేశ అసలు సిసలైన హీరో శ్యామాప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివర్ణించారు.దేశం కోసం యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని జన సంఘ్ కార్యకర్తలను పిలుపునివ్వడమే కాకుండా కార్యకర్తలకు తుపాకీలిచ్చి పాకిస్తాన్ పై యుద్ధం చేయడానికి పంపిన వీరుడని కొనియాడారు. పార్టీ, వ్యక్తులు, రాజకీయాల కంటే దేశమే ఫస్ట్ అని చాటి చెప్పిన గొప్ప నేత శ్యామాప్రసాద్ ముఖర్జీ అని, దేశం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ అధ్యక్షులు,పార్లమెంట్ లో ఏకైక ప్రతిపక్ష నేత కూడా ఆయనేనని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆలోచనలను,ఆశయాలను, ఆకాంక్షలను బీజేపీ తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని తెలిపారు.ముఖర్జీ ఆకాంక్షలకు అనుగుణంగా వాజ్ పేయి ప్రభుత్వం అణ్వాయుధాలను సమకూరిస్తే..370 ఆర్టికల్ ను రద్దు చేసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను నరేంద్రమోదీ నెరవేర్చారని మహనీయుడి ఆశయాలు, ఆకాంక్షలను అమలు చేయడమే ఆయనకు అందిస్తున్న ఘనమైన నివాళి

# దేశ రాజధాని ఢిల్లీని ముంచెత్తిన దుమ్ము తుపాను

(ఐఎండీ) వెల్లడించిన వివరాల ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వరకు నమోదైంది. దీని ఫలితంగా వ్యవసాయ భూముల వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 39.8 డిగ్రీల సెల్సియస్ నుంచి ఏకంగా 28.8 డిగ్రీలకు పడిపోయింది. ఈ వాతావరణ మార్పులకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐఎండీ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు ఆరెంజ్, రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే కొద్ది గంటల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 80-100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. రానున్న రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39-41 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

# రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# కేంద్రమంత్రులతో సీఎం రేవంత్ చర్చలు విజయవంతం

స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-ఎఎ విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ తదితర అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (ఓండజఆ) శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా ముందుకు సాగేందుకు కృషి చేస్తారు.

# సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు

ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క పాత్ర అత్యంత కీలకమని, ఆయన పర్యవేక్షణలోనే ఈ అక్రమాలు సాగాయని హరీశ్ రావు స్పష్టం చేశారు.ప్రస్తుతం సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైపోవడంపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తంలో మాయమైన బొగ్గు ఎక్కడ ఉందో యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.1600 కోట్ల విలువైన బొగ్గును మాయం చేసి, దానికి పన్నులు ఎలా చెల్లించారో లెక్కలు తేలాల్సి ఉందన్నారు. అసలు తవ్వని బొగ్గుకు పన్నులు కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఏ ప్రాతిపదికన డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.ఒకప్పుడు లాభాల బాటలో పయనిస్తూ, కార్మికులకు అండగా నిలిచిన సింగరేణిని.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల గనిగా మార్చేసిందని హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ అక్రమాల వెనుక అధికార పక్షానికి చెందిన పెద్దల హస్తం ఉందన్న ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువులకు చెందిన శోధ కంపెనీ సైతం ఈ ఓబీ అక్రమాల్లో భాగస్వామిగా మారిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సంస్థను లాభాల బాటలో నడిపించాల్సింది పోయి, సింగరేణి థర్మల్ ప్రాజెక్టును కూడా క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 8 మంది రెబెల్ ఎమ్మెల్యేలపై వేటు వేసిన మమతా బెనర్జీ

బహిష్కరణకు గురైన వారిలో ఫిర్హాద్ హకీమ్, జావేద్ అహ్మద్ ఖాన్, అరూప్ రాయ్ (రెబల్స్ ప్రకటించిన కొత్త ప్రెసిడెంట్), రథిన్ ఘోష్, బిప్లబ్ మిత్ర, సబీనా యాస్మిన్, స్నేహాశిష్ చక్రవర్తి, మాజీ మంత్రి అరూప్ బిశ్వాస్ ఉన్నారు.

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో మొత్తం ఉన్న టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ నేతలు తమవైపే ఉన్నారని తిరుగుబాటు వర్గం చెబుతోంది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 60 మంది సపోర్ట్ తమకే ఉందని రెబల్స్ ప్రకటించారు. ఇప్పటికే 28 మంది టీఎంసీ లోక్‌సభ ఎంపీల్లో 20 మంది ఎంపీలు గ్రూప్‌గా విడిపోయి.. 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో విలీనమైన తరుణంలో... మెజారిటీ ఎమ్మెల్యేలు తిరగబడటం మమతా బెనర్జీ పార్టీ మనుగడకే ముప్పుగా మారింది.

# సంపాదకీయం

భారత శక్తి VOICE OF INDIAN

## ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక శక్తి..
## 10 ఏళ్లలో ఏడుగురు ప్రధానులు

ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన దేశం. పారిశ్రామిక విప్లవానికి పుట్టినిల్లు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు. అలాంటి బ్రిటన్ (యూకే) నేడు తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా పేరున్న యునైటెడ్ కింగ్‌డమ్ ప్రస్తుతం వృద్ధి మందగమనం, అధిక రుణభారం, జీవన వ్యయాల పెరుగుదల, ఆరోగ్య వ్యవస్థ ఒత్తిడి, వలసల సమస్యలు, ఉత్పాదకత తగ్గుదల వంటి అనేక సవాళ్లతో పోరాడుతోంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని కలిగి ఉన్న దేశం ఈ పరిస్థితికి ఎలా చేరుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం గత కొన్ని దశాబ్దాల విధాన నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఇంకా నిర్మాణాత్మక బలహీనతల్లో దాగి ఉంది.బ్రిటన్ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న తీవ్ర అస్థిరత మరోసారి ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. బ్రిటన్ తాజా ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేయకుండానే అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో గత 10 ఏళ్ల వ్యవధిలోనే బ్రిటన్ ఏకంగా ఆరుగురు ప్రధాన మంత్రులను మార్చినట్లయింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన ఒక అగ్రదేశంలో ఈ స్థాయి రాజకీయ సంక్షోభం తలెత్తడం ప్రజాస్వామ్య వ్యవస్థల స్థిరత్వంపై సరికొత్త చర్చకు దారితీస్తోంది.బ్రిటన్ రాజకీయాల చరిత్రను గమనిస్తే.. 2016 లో జరిగిన బ్రెక్సిట్ రెఫరెండం తర్వాత అక్కడ స్థిరమైన ప్రభుత్వం అనేది లేకుండా మారింది. నాటి ప్రధాని డేవిడ్ కామెరూన్ రాజీనామా తర్వాత తెరిసా మే, ఆపై బోరిస్ జాన్సన్, కేవలం 45 రోజులు మాత్రమే పదవిలో ఉన్న లిజ్ ట్రస్, ఆ తర్వాత భారత సంతతికి చెందిన రిషి సునక్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు పదవుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఇటీవలే లేబర్ పార్టీని భారీ విజయంతో అధికారంలోకి తెచ్చిన కీర్ స్టార్మర్ సైతం దేశంలోని ఆర్థిక సవాళ్లు, అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఐదేళ్ల పూర్తి టర్మ్ ముగియకుండానే తప్పుకోవడంతో బ్రిటన్ పతనావస్థకు ఈ సంక్షోభం అద్దం పడుతోంది.సరిగ్గా ఇదే 10 ఏళ్ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం సాధించిన రాజకీయ స్థిరత్వాన్ని ఇక్కడి పరిణామాలతో పోల్చి చూపిస్తున్నారు. లండన్ వీధుల్లో ప్రధానుల మార్పిడి ఒక ప్రహసనంగా మారిన తరుణంలో.. భారత్‌లో మాత్రం ఇదే దశాబ్ద కాలంలో కేవలం ఒకే ఒక్క ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో స్థిరమైన పరిపాలన సాగుతోంది. ఈ రాజకీయ స్థిరత్వమే అంతర్జాతీయంగా భారతదేశ ఆర్థిక వృద్ధికి, దౌత్యపరమైన విజయాలకు ప్రధాన ఇంధనంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఒకవైపు బ్రిటన్ వంటి సంప్రదాయ ప్రజాస్వామ్య దేశాలు నాయకత్వ మార్పులతో, విధానపరమైన అస్థిరతతో కొట్టుమిట్టాడుతుంటే.. భారతదేశం వరుసగా మూడోసారి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకుని స్థిరమైన విధానాలతో ముందుకు సాగుతోంది. కీర్ స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే ఉత్కంఠ నెలకొనగా.. గ్లోబల్ ఇన్వెస్టర్లు మాత్రం స్థిరత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భారత్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.20వ శతాబ్దం మధ్య వరకు బ్రిటన్ తయారీ రంగంలో అగ్రగామిగా ఉండేది. అయితే కాలక్రమేణా భారీ పరిశ్రమలు క్షీణించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఫైనాన్స్, బ్యాంకింగ్, సేవల రంగాలపై ఆధారపడిపోయింది.ప్రత్యేకించి లండన్ నగరం ప్రపంచ ఆర్థిక కేంద్రంగా ఎదిగింది. కానీ ఈ మార్పు దేశంలోని మిగతా ప్రాంతాలకు సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయింది. ఫలితంగా లండన్ అభివృద్ధి చెందుతుండగా, ఇతర ప్రాంతాలు వెనుకబడ్డాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పరిస్థితులు మారడం ప్రారంభమయ్యాయి. అమెరికా ఆ తరువాత చైనా వంటి దేశాలు ఆర్థికంగా బలపడటంతో బ్రిటన్ తన ఆధిపత్యాన్ని క్రమంగా కోల్పోయింది. అయినప్పటికీ, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగం, విద్య, సాంకేతికత వంటి రంగాల ద్వారా ప్రపంచంలో ప్రాధాన్య స్థానాన్ని కొనసాగించింది.బ్రిటన్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఉత్పాదక రంగం బలహీనపడటం. గత మూడు దశాబ్దాలుగా తయారీ పరిశ్రమల ప్రాధాన్యం తగ్గిపోయింది. పరిశ్రమలు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల దేశాలకు తరలిపోయాయి.దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ అధికంగా ఫైనాన్షియల్ సర్వీసులపై ఆధారపడిపోయింది.ముఖ్యంగా లండన్ నగరం కేంద్రంగా బ్యాంకింగ్,ఇన్వెస్ట్‌మెంట్ రంగాలు విస్తరించాయి.కానీ ఈ రంగాలు దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయాయి.లండన్ సంపన్నంగా మారుతుంటే, ఇతర ప్రాంతాలు వెనుకబడిపోయాయి.2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం బ్రిటన్‌కు పెద్ద దెబ్బగా మారింది.బ్యాంకింగ్ రంగంపై అధిక ఆధారపడటం కారణంగా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.ఆ తర్వాత ప్రభుత్వం భారీ వ్యయ నియంత్రణ విధానాలను అమలు చేసింది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం వల్ల ఆరోగ్యం, విద్య, స్థానిక సంస్థలు, సామాజిక సంక్షేమ రంగాలు నిధుల కొరతను ఎదుర్కొన్నాయి.

ఈ ప్రభావం ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ప్రజా సేవల నాణ్యత క్రమంగా పడిపోయింది.బ్రిటన్ ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.ఉత్పాదక రంగాన్ని పునరుద్ధరించడం,టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెంచడం,గృహ నిర్మాణాలను వేగవంతం చేయడం,విద్య నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం కీలకం.

అలాగే ప్రాంతీయ అసమానతలను తగ్గించి లండన్ వెలుపల ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.బ్రిటన్ ఒక్కసారిగా కుప్పకూలిపోతున్న దేశం కాదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని నడిపించిన దేశం, నేడు తన ఆర్థిక భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది.ఈ సంక్షోభం నుంచి బయటపడగలదా లేదా అనేది రాబోయే సంవత్సరాల్లో తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మాత్రం బ్రిటన్ ఒక కీలక మలుపు వద్ద నిలబడి ఉంది.

## 2026 సంవత్సరానికి సంబంధించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం



పద్మ భూషణ్: ప్రముఖ నటుడు మమ్ముట్టి (కళలు), గాయని అల్కా యాగ్నిక్ (కళలు), టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృతరాజ్ (క్రీడలు), ప్రముఖ భారతీయ-అమెరికన్ క్యాన్సర్ నిపుణులు (ఆంకాలజిస్ట్) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు (వైద్యం) విభాగాల్లో పద్మ భూషణ్ పురస్కారాన్ని అందుకోగా.. జేఎంఎం వ్యవస్థాపకులు శిబు సోరెన్ (మరణానంతరం) తరఫున వారి భార్య రూపీ సోరెన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.పద్మ శ్రీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (క్రీడలు), మహిళా హాకీ క్రీడాకారిణి సవితా పునియా (క్రీడలు), హిమాలయ వైద్య సంప్రదాయాన్ని కాపాడుతున్న లడఖ్ కి చెందిన డాక్టర్ పద్మ గుర్మెత్ (వైద్యం), కర్ణాటకకు చెందిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ప్రభాకర్ కోరె (సాహిత్యం ꠸ విద్య-సామాజిక సేవ) సహా పలువురు ప్రముఖులు ఈ పురస్కారాన్ని అందుకున్న వారిలో ఉన్నారు. రెండో విడత కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రముఖ తెలుగు సినిమా నటులు గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్, మాగంటి మురళీ మోహన్ పద్మ శ్రీ పురస్కారాలను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. వీరిద్దరూ కళల రంగంలో చేసిన విశేష కృషికి గౌరవంగా ఈ విశిష్ట పౌర పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పద్మశ్రీ గౌరవాన్ని పొందిన గ్రహీతలకు సంబంధించిన మరింత సమాచారం.

### డాక్టర్ గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హాస్యానికి సరికొత్త అర్థాన్ని ఇస్తూ, దశాబ్దాలుగా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నటుడు డాక్టర్ గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్. సామాన్య ప్రజల పెదవులపై చిరునవ్వులు చిందించడమే ధ్యేయంగా సాగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.ఆయన 1955 ఏప్రిల్ 15న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా, పటమట లంకలో ఒక నిబద్ధత కలిగిన పాఠశాల ఉపాధ్యాయుని వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. మానవీయ విలువలు, క్రమశిక్షణ గల వాతావరణంలో పెరిగిన ఆయన, సెరామిక్ ఇంజనీరింగ్‌లో ప్రథమ శ్రేణిలో డిగ్రీ పూర్తి చేశారు. ఇంజనీర్‌గా స్థిరమైన ఉద్యోగం చేసే అవకాశం ఉన్నప్పటికీ, తన మనసుకు నచ్చిన కళారంగాన్ని ఎంచుకుని చెన్నై ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. అక్కడ నటన, మైమ్ (మూకాభినయం) లలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 'గోల్డ్ మెడల్' సాధించారు. కేవలం గ్లామర్ కోసం కాకుండా, నిత్య జీవితంలో ఒత్తిడిని ఎదుర్కొనే సామాన్య ప్రజలకు థియేటర్‌లో పూర్తి వినోదాన్ని అందించి, వారు పెట్టే ప్రతి పైసాకు న్యాయం చేయాలనే సంకల్పంతో ఆయన మొదటి నుంచే హాస్య పాత్రల వైపు అడుగులు వేశారు.1977లో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన రాజేంద్ర ప్రసాద్ , నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో ఆరు భాషల్లో 286కు పైగా చిత్రాలలో నటించి మెప్పించారు. అంతర్జాతీయ సినిమాల్లోనూ నటించి తన ప్రతిభను చాటారు. కుటుంబ కథా చిత్రాలు, సామాజిక సందేశాత్మక సినిమాలు, అద్భుతమైన హాస్యభరిత పాత్రలతో ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. నటనతో పాటు మైమ్, మిమిక్రీ, హార్మోనియం మరియు సితార్ వాయించడం వంటి కళలలో ఆయన దిట్ట. అంతేకాకుండా, ఎన్నో సూపర్ హిట్ పాటలకు నేపథ్య గానం చేయడంతో పాటు సంగీత దర్శకత్వం కూడా వహించారు. పరిమిత బడ్జెట్ చిత్రాలు కూడా సమాజంపై ఎంతటి బలమైన ముద్ర వేయగలవో ఆయన నిరూపించారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 8 నంది అవార్డులు, ఒక జాతీయ పురస్కారం, కెనడా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రశంసలు దక్కాయి. ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక "నట కిరీటి" బిరుదును అందుకున్నారు. కేవలం 43 సంవత్సరాల పిన్న వయసులోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి "కళాప్రపూర్ణ" గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు. అమెరికా, బ్రిటన్, ఆసియా, యూరప్ వంటి ప్రపంచ దేశాలలో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా, ఎంతో మంది యువ ప్రతిభావంతులకు మార్గదర్శిగా నిలిచారు. 2015లో భారీ మెజారిటీతో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా ) అధ్యక్షుడిగా ఎన్నికై పరిశ్రమకు సేవలందించారు.సినిమా రంగంలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకపోయినప్పటికీ, కేవలం స్వయంకృషి, క్రమశిక్షణతో అగ్రస్థానానికి ఎదిగిన రాజేంద్ర ప్రసాద్, తన మధ్యతరగతి మూలాలను ఎన్నడూ మరువలేదు. సమాజం పట్ల బాధ్యతతో ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలను గుప్తంగా నిర్వహిస్తున్నారు. పేద పిల్లల పాఠశాల ఫీజులు చెల్లించడం, అనాథ శరణాలయాలకు నిత్యావసర వస్తువులు అందించడం, లయన్స్ మరియు రోటరీ క్లబ్‌ల ద్వారా సేవలు చేయడం, మదర్ థెరిసా సేవా సంస్థలకు మద్దతు ఇవ్వడం వంటి పనులతో తన ఉదారతను చాటుకుంటున్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం యోగాను ప్రోత్సహిస్తూ, ఆడపిల్లల రక్షణ, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. తిరుమల యాత్రికుల కోసం ఆయన "రాజేంద్ర ప్రసాదం" పేరుతో ఒక అతిథి గృహాన్ని విరాళంగా ఇచ్చారు. తన "నట కళా వేదిక" ద్వారా తెలుగు పద్య నాటకాలను ప్రోత్సహిస్తూ, రంగాస్థల కళాకారులను ఆదుకుంటున్నారు. అంతేకాకుండా, వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు ఎల్లప్పుడూ తక్షణ సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు.చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరినీ తన నటనతో అలరిస్తూ, నిత్య జీవిత ఒత్తిడిని దూరం చేస్తున్న అరుదైన నటుడు రాజేంద్ర ప్రసాద్. నేటి ఆధునిక, బిజీ లైఫ్‌లోనూ ఆయన సినిమా క్లిప్స్ ప్రేక్షకుల ముఖాల్లో ప్రశాంతమైన చిరునవ్వును, ఆనందాన్ని నింపుతూనే ఉన్నాయి.

### మాగంటి మురళీ మోహన్

మాగంటి మురళీ మోహన్ అనేక రంగాలలో తనదైన ముద్ర వేసిన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రస్తుతం 85 సంవత్సరాల వయస్సులోనూ ఆయన ఎంతో చురుగ్గా సాగుతున్నారు. ఆయన 1940 జూన్ 24న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటుపల్లిలో జన్మించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొని, దేశం కోసం తమ కుటుంబ ఆస్తులను సైతం త్యాగం చేసిన దేశభక్తుల కుటుంబం నుంచి మురళీ మోహన్ వచ్చారు. ఏలూరులోని ప్రసిద్ధ సర్ సి.ఆర్.ఆర్ కళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన, వ్యాపారంపై ఉన్న మక్కువతో తన చదువును మధ్యలోనే నిలిపివేశారు. రంగస్థలం కూడా ఆయనకున్న మరొక పెద్ద వ్యాపకం.1973లో చలనచిత్ర పరిశ్రమలోకి ప్రవేశించిన మురళీ మోహన్ , ఇటీవల తన సినీ జీవితంలో స్వర్ణోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు. ఆయన ఎన్నో గౌరవ పురస్కారాలను అందుకోవడమే కాకుండా 350కి పైగా చిత్రాలలో ప్రధాన పాత్రలలో నటించారు. ఆయన 'జయభేరి ఆర్ట్ ప్రొడక్షన్స్' సంస్థను స్థాపించి తెలుగు, కన్నడ భాషల్లో 25 చిత్రాలను నిర్మించారు. ఆయన అందుకున్న పురస్కారాలలో ఉత్తమ నటుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన ప్రతిష్టాత్మక నంది అవార్డు కూడా ఉంది. ఆయన నిర్మించిన చిత్రాలలో ఆరు సినిమాలు ఉత్తమ చిత్రంగా నంది అవార్డుతో సహా పలు అవార్డులను గెలుచుకున్నాయి. జయభేరి బ్యానర్‌లో వచ్చిన సినిమాలు ఆయన అభిరుచిని, విలువలతో కూడిన స్వచ్ఛమైన సినిమా కథలపై ఆయనకున్న నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. మురళీ మోహన్ నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (చీఖీణజ) సభ్యుడిగా, ఏపీ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఙూాఖీణజ) ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా )లో 10 సంవత్సరాలకు పైగా ఆయన కీలక బాధ్యతలను నిర్వహించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవాన్ని నిర్వహించడంలో ఆయన చేసిన కృషికి గానూ ఎంతో ప్రశంసలు లభించాయి. రంగాస్థల కళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డులను కేటాయించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2025లో ఆయన "తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ" ఛైర్మన్‌గా వ్యవహరించారు. తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ఆయన సినీ పరిశ్రమలోని తన సహచరుల మద్దతుతో సహాయక, నిధుల సేకరణ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలిచారు. ఎంతో దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన కలిగిన ఆయన, హైదరాబాద్‌లోని పలు దేవాలయాల సముదాయమైన 'దైవ సన్నిధానం' సంస్థకు కార్యదర్శిగా మరియు అధ్యక్షుడిగా సేవలందించారు.చిత్ర పరిశ్రమలో విజయవంతమైన ప్రస్థానం తర్వాత, మురళీ మోహన్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి అడుగుపెట్టి 'జయభేరి ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను స్థాపించారు, ఇది అతి తక్కువ కాలంలోనే ప్రజల నమ్మకాన్ని చూరగొంది. ఆటోమొబైల్స్ రంగం కూడా కలిపి ఉన్న 'జయభేరి గ్రూప్'కు ఆయన నాయకత్వం వహిస్తున్నారు. ఈ సంస్థలు వేలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. సమాజానికి తిరిగి ఏదో ఒకటి ఇవ్వాలని ఆయన ఎల్లప్పుడూ నమ్ముతారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఆయన 'మురళీ మోహన్ చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల్లో పలు వైద్య శిబిరాలను నిర్వహించారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా మరియు క్యాన్సర్ నివారణపై ఈ శిబిరాల్లో ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ ట్రస్ట్ అంధుల పాఠశాలకు మరియు ప్రమాద బాధితులకు కూడా తన మద్దతును అందిస్తోంది. ఆయనకున్న ప్రజాదరణ మరియు సేవా కార్యక్రమాల కారణంగా, 2014లో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నియోజకవర్గం నుండి పార్లమెంట్ సభ్యుడిగా (ఎంపీగా) ఎన్నికయ్యారు. 2015లో అత్యంత పవిత్రమైన గోదావరి పుష్కరాల నిర్వహణలో ఆయన పోషించిన పాత్ర ఎంతో ప్రశంసలు అందుకుంది. గొప్ప నిబద్ధతతో పనిచేసిన రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా ఆయన ప్రజల నుండి ఎంతో అభిమానాన్ని చూరగొన్నారు. మురళీ మోహన్ తన చిత్రాలకు గానూ రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థల నుండి పలు గౌరవ పురస్కారాలను గెలుచుకున్నారు. కళారంగంలో మరియు సేవా ఆధారిత కార్యక్రమాలలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

## తాండూర్ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి
## బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం

- కొడంగల్ మెడికల్ కాలేజీ పేరుతో జిల్లా ఆస్పత్రి నిర్వహణ ఏమిటి?
- తాండూర్‌కే ప్రత్యేక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి డిమాండ్
- జిల్లా ఆస్పత్రి, మాతా-శిశు కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు
- తాండూర్ హక్కుల కోసం ప్రజలందరినీ ఏకం చేస్తాం




**తాండూరు జూన్ 23 భారత శక్తి** తాండూర్ పట్టణ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తాండూర్ జిల్లా ఆస్పత్రి, అలగే మాతా-శిశు కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగారం మల్లేశం, కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ..., కొడంగల్ మెడికల్ కాలేజీ పేరుతో తాండూర్ జిల్లా ఆస్పత్రిలో మార్పులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులను బదిలీ చేస్తూ, వారి స్థానంలో మెడికల్ కాలేజీ సిబ్బందిని నియమిస్తున్నారని ఆరోపించారు. అలాగే జనన, మరణ ధ్రువపత్రాలపై కూడా కొడంగల్ మెడికల్ కాలేజీ పేరు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. తాండూర్‌లో అన్ని వసతులు, మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ వాటిని ఇతర ప్రాంతాలకు మళ్లించడం సమంజసం కాదన్నారు. తాండూర్ ప్రజాప్రతినిధులు, ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాల నాయకులు అందరూ కలిసి తాండూర్‌కే ప్రత్యేక మెడికల్ కాలేజీ సాధించుకునే దిశగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, సీనియర్ నాయకుడు మోత్కుపల్లి చంద్రశేఖర్, పట్టణ ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, ప్రహ్లాద్ జాదవ్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బండారు శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి మంతటి రాజు, ప్రభాకర్ గౌడ్, బబ్లు, సాయిలు, రాజు, భీమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## హామీ ఇచ్చారు..అమలు చేశారు..
## SVSB అపార్ట్మెంట్ లో సొంత నిధులతో బోరు ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్..



**రామచంద్రాపురం జూన్ 23 భారత శక్తి** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని SVSB అవతార్ గేటెడ్ అపార్ట్మెంట్ లో ఇటీవల పర్యటించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. తాగునీటి అవసరాల కోసం బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా రెండు రోజుల్లోనే బోరు వేయించి.. మంగళవారం సాయంత్రం అపార్ట్మెంట్ వాసుల సమక్షంలో బోరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు ఇవ్వడమే కాదు ఆచరణలో చూపించడమే తమ విధానమని తెలిపారు. ప్రభుత్వ నిధులతోపాటు సొంత నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అడిగిన వెంటనే సొంత నిధులతో బోర్ వేయించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు అపార్ట్మెంట్ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, సొసైటీ అధ్యక్షులు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక వేలం వ్యవహారంలో అవకతవకలు జరిగాయని ప్రజా సంఘాల ఆరోపణ ఆర్ ఐ పై చర్యలు తీసుకోవాలి

- శివసాగర్ ప్రాజెక్ట్‌లో జరుగుతున్న పనులను తక్షణమే నిలిపివేయాలి
- లేకపోతే భారీ ఆందోళనలకు సిద్ధం - ప్రజాసంఘ నాయకుల డిమాండ్
- తాసిల్దార్ కు విజ్ఞప్తి పత్రం అందజేత



**వికారాబాద్ జూన్ 23 భారత శక్తి** అక్రమ ఇసుక వేలంలో అవకతవకలకు పాల్పడుతున్న యాలాల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) శివచరణ్ కుమార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం యాలాల తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య మాట్లాడుతూ, ..అక్రమంగా ఇసుక తరలించిన ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డంప్ చేసిన సుమారు 120 ట్రాక్టర్ల ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై తరలించేందుకు ఆర్ఐ శివచరణ్ అనుమతులు ఇప్పించారని ఆరోపించారు.అదేవిధంగా మండలంలోని శివసాగర్ ప్రాజెక్టు నుంచి ఇసుక తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అక్కడ మట్టి, రాయి, చిలప వేసి చేపడుతున్న పనుల వల్ల స్థానిక మత్స్యకారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వెంటనే ఆ పనులను నిలిపివేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.అక్రమాలకు పాల్పడిన మండల ఆర్ఐపై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహేందర్, మెట్లి కృష్ణ, ఆర్ఐ శివచరణ్ బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం: చిలుక మధుర ఉపేందర్ రెడ్డి.



**ఎల్బీనగర్, జూన్ 23 (భారత శక్తి):**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి ఆర్కేపురం డివిజన్ లోని శ్రీకృష్ణ నగర్ లోని వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చీరలను అందజేశారు. సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఆడ బిడ్డకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్నీ ప్రభుత్వం చేపట్టడం జరిగిందన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా మహిళలకు సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఉచిత బస్సు,10 లక్షల వరకు మహిళా సంఘాలకు రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సులను వారి సొంతంగా నిర్వహించుకునేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. అర్హులైన ప్రతి మహిళకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రేణుక, రమా దేవి, కవిత, జయమ్మ, మాధవి, సంతోష, శ్వేత , లావణ్య, ప్రమీల, స్వరూప,రజిత, తదితరులు పాల్గొన్నారు.

## హనుమత్ రథోత్సవంలో పాల్గొన్న పున్న గణేష్ దంపతులు



**ఎల్బీనగర్, జూన్ 23 (భారత శక్తి):** మహేశ్వరం నియోజకవర్గం శ్రీ రామకృష్ణ పురం డివిజన్ సౌభాగ్యపురం కాలనీలో శ్రీ అలివేలు మంగ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి పంచమ దశ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడవ రోజు హనుమత్ రథోత్సవంలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామ కృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పున్న నిర్మల గణేష్ నేత పూజా కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత,గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్ దంపతులు,జెల్ల జగన్నాథం దంపతులు, పగడాల ఎల్లన్న, మల్లేష్ యాదవ్, లింగారెడ్డి, సుధాకర్ గుప్తా, పురుషోత్తం గుప్తా, అచ్చయ్య, దేవాలయం కమిటీ మరియు సౌభాగ్యపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ఎంఆర్ కే మూర్తి, చంద్రశేఖర్, సుధాకర్ గుప్తా, కృష్ణమూర్తి, శ్రీకాంత్, అనిల్ చంద్రకాంత్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన సదస్సు

**- ఇంటింటి సర్వేలో బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలి: డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య**

**బడంగ్‌పేట్, జూన్ 23: భారత శక్తి దినపత్రిక,** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (BLO), బూత్ లెవల్ ఏజెంట్ల (BLA) అవగాహన సదస్సు మంగళవారం బడంగ్‌పేట్ సర్కిల్-16 కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రజాభవన్‌లో జరిగింది. జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహణపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

### ఓటరు జాబితా నాణ్యతపై ప్రత్యేక దృష్టి

ఈ సదస్సులో ఓటరు జాబితా మ్యాపింగ్, ప్రోజెనీ మ్యాపింగ్, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన మరియు డూప్లికేట్ ఓటర్ల వివరాల పరిశీలన వంటి కీలక అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ ఏజెంట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

### నిబంధనల ప్రకారం సర్వే పూర్తి చేయాలి: డిప్యూటీ కమిషనర్

సమావేశంలో బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్/AERO వి. సమ్మయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఓటర్ల ముసాయిదా జాబితా తయారీతో పాటు అర్హులైన వారి నుంచి ఫారం 6, 7, 8 దరఖాస్తులను సేకరించడంలో బీఎల్ఓలకు, బీఎల్ఏలు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ రెడ్డి, బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ పోలీసుల చాకచక్యం

**- హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన కిరాతకురాలు - చున్నీతో భర్త గొంతును నులిమి చంపేసిన భార్య**

**- నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు**



**ఎల్బీనగర్, జూన్ 23 (భారత శక్తి):** ఆత్మహత్యగా భావించిన ఒక అనుమానాస్పద మృతి కేసులోని అసలు గుట్టును ఎల్బీనగర్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. తన భర్తను అత్యంత దారుణంగా, కిరాతకంగా నొక్కి చంపిన 33 సంవత్సరాల మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు.

### కేసు వివరాలు:

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్, క్రైమ్ నెంబర్: 851/2026, సెక్షన్: 103(1) దీచీూ (గతంలో సెక్షన్ 194 దీచీూా కింద నమోదైన కేసు).

### అరెస్ట్ అయిన నిందితురాలి వివరాలు:

శ్రీమతి బోడ స్వరూప, భర్త: (లేట్) బోడ నర్సింగ్, వయస్సు: 33 సంవత్సరాలు, కులం: ఎస్టీ , వృత్తి: కూరగాయల వ్యాపారి, నివాసం: ఇండ్ల నెంబర్: 11-21-1184, ఎల్బీనగర్,ఎన్టీఆర్ నగర్ రంగారెడ్డి జిల్లా. (సొంత ఊరు: తట్టుపల్లి గ్రామం, కొరవి మండలం, మహబూబాబాద్ జిల్లా).

### కేసు పూర్వపరాలు :

ఎల్బీనగర్ లోని ఎన్టీఆర్ నగర్, ఒక అద్దె ఇంట్లో బోడ నర్సింగ్ అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ప్రాథమికంగా, ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా (సెక్షన్ 194 బిఎన్ఎస్ఎస్ కింద) కేసు నమోదు చేయడం జరిగింది. అయితే, ఎల్బీనగర్ పోలీసులు జరిపిన నిశితమైన, లోతైన దర్యాప్తు మరియు ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నుండి వచ్చిన శవపరీక్ష (పీఎంఇ) నివేదికతో ఇది ఆత్మహత్య కాదని తేలింది. మృతుడి మరణానికి గల కారణం ఉరివేసుకోవడం కాదని, మెడపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చి "గొంతు నులిమి చంపడం (స్ట్రాంగ్యులేషన్ ) అని వైద్య నిపుణులు ఖచ్చితమైన నివేదిక ఇచ్చారు.

### నేరానికి గల కారణం - అమలు చేసిన తీరు:

నిందితురాలిని విచారించగా, బోడ స్వరూపకు తన సొంత గ్రామానికి చెందిన మోహన్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తేలింది. ఈ విషయం భర్తకు తెలియడంతో గత కొన్ని రోజులుగా వారి మధ్య తీవ్రమైన కుటుంబ కలహాలు జరుగుతున్నాయి.తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన స్వరూప, అతడిని అంతమొందించాలని పథకం వేసింది. ఈ క్రమంలో తేది: శనివారం మధ్యాహ్నం 3 నుండి 4 గంటల మధ్య ఇంట్లో జరిగిన గొడవను ఆసరాగా చేసుకుని, నిందితురాలు తన భర్తను శారీరకంగా లొంగదీసుకుని, అతని ఛాతీపై కూర్చొని తెల్లటి చున్నీతో గొంతు గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేసింది. ఆ తర్వాత చట్టం నుండి తప్పించుకోవడానికి, శవాన్ని ఇనుప మంచానికి చున్నీతో కట్టి అది ఆత్మహత్యగా చిత్రీకరించి చుట్టుపక్కల వారిని, పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది.

### అరెస్ట్ మరియు రికవరీ:

సోమవారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు ఎల్బీనగర్ పోలీసులు ప్రత్యేక బృందంతో నిందితురాలు బోడ స్వరూపను అల్కాపురి వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె తన నేరాన్ని పూర్తిగా అంగీకరించింది. నిందితురాలి వద్ద నుండి హత్య జరిగిన వెంటనే తన ప్రియుడికి ఫోన్ చేయడానికి ఉపయోగించిన వీవో టీ3 స్మార్ట్‌ఫోన్ మరియు హత్యకు ఉపయోగించిన తెల్లటి చున్నీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును హత్య కేసుగా సవరిస్తూ (సెక్షన్ 103(1) బిఎన్ఎస్ కింద మార్చి), నిందితురాలిని గౌరవనీయ న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగింది. ఈ కేసులో ఇతర వ్యక్తుల ప్రమేయంపై ఎల్బీనగర్ పోలీసులు మరింత దర్యాప్తు జరుపుతున్నారని సీఐ వినోద్ కుమార్ తెలిపారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే మంచిరెడ్డి డ్రామాలు

**- 15 ఏళ్లు పట్టించుకోని లష్కర్ గూడ బ్రిడ్జిపై ఇప్పుడు సడన్ ప్రేమా?**

**- మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డిపై మండిపడ్డ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ సి.హెచ్ భాస్కరాచారి, కాంగ్రెస్ నేతలు**



**అబ్దుల్లాపూర్ మెట్టు, జూన్ 23: భారత శక్తి,** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి లష్కర్ గూడలో సర్కస్ ఫీట్లు చేస్తున్నారని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్. భాస్కర్ చారి అధ్యక్షతన విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పరిమితం చేసినట్లే, ఇబ్రహీంపట్నం ప్రజలు మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ఇంటికే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధి కేవలం మల్‌రెడ్డి రంగారెడ్డితోనే సాధ్యమని నమ్మి ప్రజలు కిషన్ రెడ్డిని ఓడించారన్నారు. నియోజకవర్గంలో ఉనికి చాటుకునేందుకే లష్కర్ గూడలో కిషన్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు లష్కర్ గూడ, మజీద్ పూర్, సంఘీ, ఇంజాపూర్, పెద్ద అంబర్ పేట్ బ్రిడ్జిల సమస్యలు కనిపించలేదా అని ప్రశ్నించారు. 2021 భారీ వర్షాలకు బ్రిడ్జిలు కూలిపోతే అప్పుడు పట్టించుకోకుండా, ఇప్పుడు కేవలం లష్కర్ గూడ బ్రిడ్జిని బూచిగా చూపిస్తూ రాజకీయం చేయడం సరికాదన్నారు.

### ఆలయాలపై రాజకీయ రంగు పులమడం నీచం: భాస్కర్ చారి

సమావేశ అధ్యక్షత వహించిన కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షులు సిహెచ్. భాస్కర్ చారి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తన సొంత నిధులతో తొర్రూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుడితే, దానిపై కూడా కిషన్ రెడ్డి రాజకీయ రంగు పులమడం ఆయన నీచ సంస్కృతికి అద్దం పడుతోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డిల చొరవతో కోహెడలో 179 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నామని, దీని ద్వారా 40 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. పాత స్థలాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ కోసం కేటాయించామని స్పష్టం చేశారు.

### అభివృద్ధి పథంలో ఇబ్రహీంపట్నం

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని నేతలు పేర్కొన్నారు. అనాజ్ పూర్ గ్రామం నుండి ఘట్కేసర్ వరకు రోడ్ల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రూ. 29 కోట్ల ప్రోసిడింగ్స్ కాపీలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న కిషన్ రెడ్డి అభివృద్ధిని కేవలం శిలాఫలకాలకే పరిమితం చేశారని, కానీ మల్‌రెడ్డి రంగారెడ్డి గెలిచిన తర్వాతే సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.ఈ సమావేశంలో అబ్దుల్లాపూర్ మెట్టు సర్పంచుల సంఘం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సర్పంచులు విజయ శ్రీశైలం గౌడ్, ఐలయ్య, జంగయ్య, వెంకటేష్, మాజీ సర్పంచులు ఏళ్ల బాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అంతటి ఊశయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## డీటీవో వెంకన్న పార్థివదేహానికి నివాళులర్పించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



జనగామ(భారత శక్తి )జూన్ 23: భూపాలపల్లి డీటీవో కార్యాలయం ఎదుట విధి నిర్వహణలో ఉన్న డీటీవో వెంకన్నను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తెలుసుకొని



హనుమకొండలోని డీటీవో వెంకన్న నివాసానికి టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ వెంకన్న పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నకిలీ ట్రక్ చిట్టీలు సృష్టించి ప్రభుత్వ ధాన్యాన్ని మళ్లించిన కేసులో మరో నిందుతుడు అరెస్టు, రిమాండ్.

### నిందుతుని వద్ద నాలుగు లక్షల నగదు, ట్రక్ చిట్టీలు స్వాధీనం.



రాజన్న సిరిసిల్ల, భారత శక్తి ప్రతినిధి, జూన్ 23: రుద్రంగి మండలానికి చెందిన గడ్డం నర్సారెడ్డి, అప్పారెల్ పార్క్ గోదాముల వద్ద పనిచేస్తున్న విజయ్‌కుమార్, గణేష్‌లతో కలిసి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డాడు. గోదాముల్లో నిల్వల లెక్కలు సరిగా గుర్తించడం కష్టమనే విషయాన్ని ఆసరాగా తీసుకుని, వాస్తవంగా వడ్లు పంపకుండానే రైతుల పేర్లతో నకిలీ ట్రక్ చిట్టీలను సృష్టించి గోదాములకు ధాన్యం చేరినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ క్రమంలో జూన్ 5న 378 క్వింటాళ్లు, జూన్ 9న 316 క్వింటాళ్ల ధాన్యం పంపినట్లు నకిలీ ట్రక్ చిట్టీలు రూపొందించగా, రైతుల ఖాతాల్లో ప్రభుత్వ నిధులు జమయ్యాయి. అనంతరం రైతులను మభ్యపెట్టి నగదు వసూలు చేసి, అందులో కొంత మొత్తాన్ని సహ నిందితులకు బదిలీ చేశారు. ఈనేపథ్యంలో ఈకేసులో అరుగురు నిందుతులను అరెస్ట్ చెసి రిమాండ్ కి తరలించగా, సోమవారం గడ్డం నర్సారెడ్డి ని అరెస్ట్ చేసి తన వద్ద నుండి రూ.4 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్ కి తరలించినట్లు సి.ఐ తెలిపారు.

## మోడల్ "ఫుడ్ ట్రక్కు" లను పరిశీలించిన జిల్లా కలెక్టర్.




కడప, జూన్ 23(భారత శక్తి ) : వైయస్సార్ కడప జిల్లాలో వినూత్నంగా ఆవిష్కృతమైన "సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్" వ్యవస్థలో తయారైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని పాఠశాలలకు చేర్చేందుకు అధునాతన మానిటరింగ్ సాంకేతికతతో ప్రత్యేకంగా రూపొందించిన "ఫుడ్ రవాణా ట్రక్కు"ను కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహన తయారీదారులైన "జుఖూజు=" కంపెనీ ప్రతినిధులు ఫుడ్ ట్రక్ నిర్వహణ డెమోను ప్రదర్శించి జిల్లా కలెక్టర్ కు వాహన నిర్వహణ ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీ డా. నిధీమీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, స్టెప్ సీఈవో, స్మార్ట్ కిచెన్స్ నోడల్ అధికారి జోయల్ విజయ కుమార్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బంద్ విజయవంతం




మంచిర్యాల ప్రతినిధి, జూన్ 23 (భారతశక్తి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున ప్రభుత్వ పాఠశాలల బందు విజయవంతం అయిందని ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబెర్ మదూరి సందీప్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్య నాశనం అవుతున్నాయని రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు పోతూ విద్యార్థులను,తల్లిదండ్రులను గోస్తలపాలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారు అని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రవేట్ కార్పోరేట్ పాఠశాలలు రోజుకు మితిమీరిపోతూ విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ నూతన విద్య హక్కు చట్టం తుంగలో తొక్కుతూ ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడ పోతుందని అన్నారు. అంతేగాక రాష్ట్రంలో ఎంఈఓ డీఈఓ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అనిల్,తదితరులు పాల్గొన్నారు.

## బాసర మహంకాళి ఆలయంలో జరిగిన చోరీ ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.





నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి)బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం పైఅంతస్తులోని మహంకాళి ఆలయంలో అమ్మవారి వెండి కిరీటం, హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మహంకాళి ఆలయ గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు కాజేసి అనంతరం హుండీ వ్యాసగుడి దగ్గర పడేసి పరారయ్యారు. అర్చకులు మంగళవారం తెల్లవారుజామున పూజ కోసం వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఘటన జరిగిన ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పరిశీలించి, చోరీ జరిగిన పరిస్థితులు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించిన ప్రతి కోణంలో దర్యాప్తు చేపట్టి, నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

ఆలయ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ డా. జి. జానకి షర్మిల భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఆర్చ్జలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని, త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్పెక్టర్లు రవీందర్ నాయక్,సమ్మయ్య,ఎస్ఐ లు ఇతర పోలీసు సిబ్బంది, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం

### మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



మెదక్ జిల్లా, జూన్ 223, (భారత శక్తి న్యూస్,) మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు పై కేటీఆర్ బ్యాచ్ గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు మీలా కమిషన్లు తీసుకొని,బ్రోకర్ బ్రోకర్ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ నేతలకు రాదని అన్నారు.మెదక్లో ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని ఆరోపించడం సరి కాదు అన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈ యాసంగిలో 4.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, రికార్డు స్థాయిలో ధాన్యం రావడం వల్ల కొంత ఆలస్యం అయిందన్నారు. రైతుల సమస్య కోసం కాంగ్రెస్ పార్టీయే ముందుగా ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి వరకు 90 శాతం మంది రైతులకు ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. ఇప్పటి వరకు మెదక్లో వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందని, కావాలంటే నిధుల వివరాలు బీఆర్ఎవస్ నేతలకు పంపిస్తామని చెప్పారు.

గతంలో వారి పాలనలో జరిగినట్టు ఇసుక అమ్మకోలేదని, మెదక్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోలేదన్నారు. అప్పుడు మీరు మీ షాడో ఎమ్మెల్యే ఏమి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టిక్కెట్ పరేషాన్ వల్ల ఆమె మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. వర్షాకాలంలో ప్రాణాలకు తెగించి వరదల్లో చిక్కుకున్న వారిని మా నేత దగ్గర ఉంది కాపాడదని, తమంత వెంటే ఉన్నామన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి రివ్యూ చేసిన విషయం బీఆర్ఎస్ నేతలు మరచిపోయినట్లు ఉన్నారని, అందుకే వరదలు వచ్చిన పట్టించుకోనట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం కార్యాలయాలు తరలిపోతుంటే చేతులు ముడుచుకు కూర్చున్న మీరు ఇప్పుడు అభివృద్ధి లేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెదక్ నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, చర్చకు రావాలని పిలుపునిచ్చారు. మెదక్లో జరిగిన అభివృద్ధి వివరాలు బీఆర్ఎస్ నేతలకు పంపిస్తామని, అప్పుడే జరిగిన అభివృద్ధి తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేశ్ గౌడ్,మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ చైర్మన్ రాగి అశోక్,హఫీజ్,నాగరాజు, రమేష్, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్,తాహెర్, విశ్వం, రాజశేఖర్, కౌన్సిలర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలను సవివరంగా వివరించేందుకు అధికారులు సన్నద్ధం కండి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.



వై ఎస్ ఆర్ కడప, జూన్ 23(భారత శక్తి ): ప్రభుత్వ కార్యాలయాలలో ఈ- ఆఫీస్ వినియోగం తప్పనిసరి అని భౌతిక ఫైల్స్ వినియోగంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా భవన్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసి డాక్టర్ నిధి మీనా, డిఆర్ఓ మల్లికార్జునుడు తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్వీకరణ అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకత కు ఈ-ఆఫీసు ఫైల్స్ తప్పనిసరి అని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయని తరచూ సమావేశాల్లో ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అయినప్పటికీ కొన్ని శాఖల్లో భౌతిక ఫైల్స్ ఎందుకు నడుపుతున్నారంటూ జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు అర్జీ దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి సంతృప్తి స్థాయిలో బాధ్యతాయుతం గా త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలనన్నారు. ఈ వేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని,అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు. ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ సమస్యల పరిష్కారానికి వినూత్నంగా చేపట్టిన "ఒక నెల- ఒక నియోజక వర్గం -నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా జూన్ 5న బద్వేల్ నియోజక వర్గం లో మొదట ఈ కార్యక్రమాన్నిప్రారంభించామని, జూన్ 5 నుండి బద్వేల్ నియోజక వర్గంలో మూడు పర్యటనలు పూర్తి అయ్యిఈ నెల 26 న శుక్రవారం "ఒక నెల- ఒక నియోజక వర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమ నిర్వహణలో భాగంగా గత మూడు పర్యటనల్లో అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలను సవివరంగా వివరించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జూలై నెలలో రాజంపేట నియోజకవర్గం లో "ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు"కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

#### ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.

1) ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి జిల్లాలోని వి.ఎం.పల్లె మండలంలోని పలు గ్రామాల రైతులు నకిలీ మొక్కజొన్న విత్తనాల వాడకం ద్వారా తీవ్రంగా నష్టపోయామని,నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.

2) ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ SIR ప్రక్రియలో భాగంగా పదిమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్న తప్పులను సరిచేయాలని అర్జీ సమర్పించారు.

3) కడప పట్టణం శంకరా పురం కు చెందిన జింక శివ ప్రసాద్ చిన్నచౌక్ పొలంలోని సర్వే నెంబర్ : 40/ 1 భూమిలో సర్వే చేయించి హద్దులు చూపాలని కోరుతూ రెవెన్యూ క్లినిక్ లో అర్జీ సమర్పించారు.


4) శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రకాశం కలసపాడు మండలం చెన్నారెడ్డి పల్లెలోని సర్వే నెంబర్ : 64లో తనకు చెందిన భూమిని తన అక్క కొడుకు పి.రవి ఆక్రమించు కున్నాడని తన భూమిని తనకు అందేలా చేసి నయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.

5) మైదుకూరు మండలం యల్లంపల్లెకు చెందిన గోవిందు నాగేశ్వర రెడ్డి వికలాంగుడినైన తనకు ప్రభుత్వం నుండి వికలాంగ పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు అర్జీని సమర్పించారు.

6) జమ్మలమడుగు మండలం కు చెందిన జి. వెంకట రామిరెడ్డి అనే వ్యక్తి తన భూ సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పిడి రాజ్యలక్ష్మి,డిపిఓ వెంకట సుబ్బయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, ఎస్-ఎస్ఏ ఏపిసి అనురాధ,డిప్యూటీ కలెక్టర్ లు శివరామిరెడ్డి, జాన్ ఎర్విన్, రంగస్వామి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం" కర పత్రాలను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.




వైఎస్సార్ కడప,జూన్ 23(భారత శక్తి ): రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతి,లాభసాటి వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని వైఎస్సార్ కడప జిల్లాలో 2026 జూన్ 22 నుండి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ తరపున విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక,మత్స్య, పట్టు పరిశ్రమ,సహకార, మార్కెటింగ్ మరియు అనుబంధ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో రైతులను ప్రత్యక్షంగా కలుసుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు,ఖరీఫ్ సీజన్కు సంబంధించిన సాగు సూచనలు, ఎరువులు మరియు విత్తనాల లభ్యత, సహజ వ్యవసాయం, నీటి యాజమాన్యం, డ్రోన్ సాంకేతికత, పంటల వైవిధ్యీకరణ, మార్కెట్ ఆధారిత పంటల సాగు వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే రైతుల సమస్యలు, సూచనలు స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.రైతు సేవా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉన్న సేవలు, పంటల నమోదు, పంటల బీమా, వ్యవసాయ యంత్రాల వినియోగం,విలువ ఆధారిత ఉత్పత్తులు మరియు ఆహార శుద్ధి అవకాశాలపై కూడా వివరాలు తెలియజేయబడతాయి. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలలో నిర్వహించబడే ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.

# ఆపరేటింగ్ హోల్డింగ్స్, ఉత్పాదక ఆస్తులు, మూలధన నిర్మాణం వివరాలను నేషనల్ స్టాటిస్టిక్ సర్వే లక్ష్యం

**- డైరెక్టర్ శ్రీ రంగ శ్రీనివాసులు**

వై ఎస్ ఆర్ కడప,జూన్ 23(భారత శక్తి ): నేషనల్ స్టాటిస్టిక్స్ సర్వే ద్వారా వలస కారణాల గురించి సమగ్రమైన గణాంక సమాచారాన్ని, భూమి మరియు పశువుల స్వంత కొలతలు, వ్యవసాయ విధానాలు, యాజమాన్య మరియు ఆపరేటింగ్ హోల్డింగ్స్, ఉత్పాదక ఆస్తులు, మూలధన నిర్మాణం వివరాలను నేషనల్ స్టాటిస్టిక్ సర్వే లక్ష్యమని డైరెక్టర్ శ్రీ రంగ శ్రీనివాసులు తెలిపారు. 81 వ విడత జాతీయ నమూనా సర్వే ప్రాంతీయ శిక్షణా శిబిరం జూన్ 22 నుండి 25 వరకు కడప లో మయూరా గార్డెనియా నిర్వహిస్తుండగా ఈ సర్వేలు రూరల్ మరియు అర్బన్ ప్రాంతాల్లో 1 జూలై 2026 నుంచి 30 జూన్ 2027 వరకు ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాలలో, అవి కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, అనంతపూర్, శ్రీ సత్యసాయి,కర్నూల్, నంద్యాల, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, SPSR నెల్లూరు మరియు పల్నాడు లలో జరుగుతుంది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ), ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్, 81వ రౌండ్ ఆఫ్ నేషనల్ సాంపిల్ సర్వేలో భాగంగా మైగ్రేషన్ సర్వే ఆల్ ఇండియా డెట్ అండ్ ఇన్వెస్ట్మెంట్ సర్వే (AIDIS) మరియు సిట్యుయేషన్ అసెస్మెంట్ సర్వే (SAS) ను నిర్వహించబోతుంది. సోమవారం ప్రాంతీయ శిక్షణా శిబిరం ప్రారంభోత్సవ సందర్భంగా నేషనల్ స్టాటిస్టిక్స్ సర్వే ద్వారా వలస రీతులు మరియు వలస కారణాల గురించి సమగ్రమైన గణాంక సమాచారాన్ని, భూమి మరియు పశువుల స్వంత కొలతలు, వ్యవసాయ విధానాలు,యాజమాన్య మరియు ఆపరేటింగ్ హోల్డింగ్స్,ఉత్పాదక ఆస్తులు, మూలధన నిర్మాణంమరియు భారతీయ కుటుంబాల అప్పులు సేకరించడం సర్వే లోచేయడంజరుగుతుందన్నారు. మైగ్రేషన్ సర్వే కుటుంబాల మైగ్రేషన్ లక్షణాలపై వివరంగా సమాచారం సేకరించడానికి ఉద్దేశించబడిందని, ఇందులో వెలుపల వెళ్లిన వారికి సంబంధించిన వివరాలు, మైగ్రేషన్ నమూనాలు, కారణాలు,మరియు ఆర్థిక కార్యకలాపాల స్వభావం, మరియు గమ్యస్థానంలో ఉద్యోగ అవకాశాల గురించి సమాచార మార్గాలకు సంబంధించిన సమాచారాన్ని కూడాసేకరించబడుతుందన్నారు. 81వ రౌండ్ ఆఫ్ నేషనల్ సాంపిల్ సర్వే కార్య కలాపాలను సమర్థవంతంగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం పూర్తి మద్దతు ఇస్తుందని కడప ముఖ్య ప్రణాళికా అధికారి ఎ. హజరతయ్య తెలిపారు.



సమాచారాన్ని కచ్చితమైన, విశ్వసనీయమైన మరియు సముచితమైన పద్ధతిలో సేకరించడం జరుగుతుందని తెలిపారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్), ఆంధ్రప్రదేశ్ (దక్షిణ) లోని ఉన్న ఫీల్డ్ అధికారులు సర్వే సమయంలో ప్రజలందరూ పూర్తి సహకారం చూపి సరైన మరియు నమ్మకమైన సమాచారం అందించాలని అందరికి విజ్ఞప్తి చేయబడింది. హౌస్ హోల్డ్స్ యొక్క సహకారం దేశంలో ఆధారపూర్వక విధాన రూపొందింపు మరియు అభివృద్ధి ప్రణాళికను మద్దతు ఇచ్చే నాణ్యమైన గణాంకాలను తయారు చేయడానికి చాలా ముఖ్యమని తెలిపారు.

## వరద నివారణ కోసం చేపడుతున్న మేజర్ స్టాం వాటర్ డ్రాయింగ్ పనుల పురోగతి పర్యవేక్షణ



జనగామ (భారత శక్తి)జూన్ 23: మూడవ, నాలుగవ వార్డుల పరిధిలో వరద నివారణ కోసం చేపడుతున్న మేజర్ స్టాం వాటర్ డ్రాయింగ్ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, మూడో వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి గోపి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ మంత్రి సుమలత శ్రీశైలం, 17వ వార్డు కౌన్సిలర్ పానుగంటి సువార్త పర్యవేక్షణకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ కు చైర్మన్, కౌన్సిలర్లకు స్థానిక ప్రజలు వివిధ సమస్యల పైన మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ అనిల్, సంబంధిత వర్క్ కాంట్రాక్టర్ దోర్నాల శశికాంత్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, గొట్టం శ్రీధర్ రెడ్డి, పెండ్లి సత్తిరెడ్డి, జనసేన రెడ్డి, నాగభూషణం, బాలాజీ నగర్ ఏరియా కరెంట్ లైన్ మెన్ వేముల ఉదయ్ తదితరులు ఉన్నారు.

## ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి.**

**వీర్నపల్లి కేజీబీవీ లో తనిఖీలో కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 23: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి కిచెన్ లోకి వెళ్లి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో పప్పులు, నూనె, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో 'విప్ గారికి విన్నపం' కార్యక్రమం

**-పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్, జిల్లా అధ్యక్షుడు దండు వినోద్.**

భారత శక్తి న్యూస్,వేములవాడ, జూన్ 23:వేములవాడ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ మీడియాతో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ ఆధ్వర్యంలో "విప్ గారికి విన్నపం" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల సమస్యలు, వినతులను క్షేత్రస్థాయి నుంచి సేకరిస్తామని పేర్కొన్నారు. అలా సేకరించిన సమస్యలను సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి గట్టిగా కృషి చేస్తామని చెప్పారు. ప్రతి ఒక్క ప్రజా సమస్యను నేరుగా ప్రభుత్వ విప్ దృష్టికి చేర్చేందుకు ఈ కార్యక్రమం ఒక వినూత్న వేదికగా నిలుస్తుందని రజిని కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'విప్ గారికి విన్నపం'
సమస్యలు తెలపాల్సిన చిరునామా:
సాయి నగర్, సెస్ (జజులూ) ఆఫీస్ దగ్గర, వేములవాడ.
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8368016440

## సిరిసిల్ల మండల పాఠశాలలకు ఐచ్ఛిక సెలవుల ప్రకటన.

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 23: సిరిసిల్ల మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 2026 సంవత్సరానికి గాను ఐచ్ఛిక సెలవులను ఆప్షనల్ హాలిడేస్ ప్రకటిస్తూ మండల విద్యాధికారి డి.రఘుపతి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, ప్రజాబాహుళ్యం మరియు విద్యార్థుల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐచ్ఛిక సెలవుల పట్టికను అనుసరించి తమ విద్యా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రకటించిన వివరాల ప్రకారం జూన్ 25న 9వ మొహర్రం, జూలై 16న రథయాత్ర, ఆగస్టు 21న వరలక్ష్మి వ్రతం, ఆగస్టు 28న రాఖీ పౌర్ణమి, అలాగే డిసెంబర్ 24న క్రిస్మస్ ఈవ్ సందర్భంగా ఐచ్ఛిక సెలవులు ఉండనున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవిష్యత్తులో ఈ సెలవుల తేదీలలో ఏవైనా మార్పులు ఉంటే ముందస్తుగా సమాచారం అందిస్తామని మండల విద్యాధికారి స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి

**- ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23(భారత శక్తి) బాసర మండల కేంద్రంలో, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కలిగేలా 2 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. జెండా ఊపడం ద్వారా ర్యాలీని ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ బాసర మండలంలోని పలు వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అధికారులంతా ఎస్ఐఆర్ ప్రక్రియ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా సమగ్ర ఓటర్ జాబితా తయారవుతుందని తెలిపారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ప్రజలంతా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ పవన చంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వెంటనే జమ చేయాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ డిమాండ్.**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 23: ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యం డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ డిమాండ్ చేశారు. కోనరావుపేట మండలంలోని ధర్మారం, కొలనూరు, మర్తన్‌పేట గ్రామాల రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని లారీల్లో అపరాల్ పార్క్ గోదాముకు తరలించినప్పటికీ, దానికి సంబంధించిన డబ్బులను ప్రభుత్వం ఇంతవరకు విడుదల చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లారీ ఓనర్, గోదాం అధికారి చేసిన పొరపాటు వల్ల మర్తన్‌పేట, కొలనూరు, ధర్మారం గ్రామాలకు చెందిన మూడు లారీల వరి ధాన్యం ప్రభుత్వ లెక్కల్లోకి ఎక్కలేదని, దీనివల్ల రైతులకు డబ్బులు అందడం లేదని ఆరోపించారు. ఆరు నెలల పాటు రాత్రింబవళ్లు కష్టపడి, పెట్టుబడులు పెట్టి పండించిన పంటను ప్రభుత్వానికి అమ్మితే.. అధికారుల, లారీ యజమానుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికారుల అండదండలతో నకిలీ ట్రాక్ రసీదులు సృష్టించి సుమారు కోటి రూపాయల వరకు కుంభకోణానికి పాల్పడ్డారని ముషం రమేష్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని అధికారులు చెపుతున్నారని, అయితే ఇలాంటి అక్రమాలు ఈ ఏడాదే జరిగాయా లేక గత కొన్నేళ్లుగా సాగుతున్నాయా అనేది తేలాల్సి ఉందన్నారు. కాబట్టి ప్రస్తుత సంఘటనతో పాటు, గత రెండేళ్లుగా జరిగిన ధాన్యం కొనుగోళ్ల రికార్డులన్నింటిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మూడు లారీల రసీదులను ఆన్‌లైన్‌లో రికార్డు చేయని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి మల్లయ్య, కోడం రమణ, సురం పద్మ తదితరులు పాల్గొన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**E-Tender Notice No. : N-SG-36-2026-27-COP-16, Dated: 16-06-2026** PUB/391

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డి.ఎస్.టి.ఇ / నాందేడ్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ సంఖ్య మరియు తేదీ :N-SG-36-2026-27-COP-16, తేదీ: 16-06-2026. పని పేరు: S&T వర్క్స్ ఇన్ ఆదిలాబాద్, కృవాట్, హిమాయతానగర్, భోకర్, మాన్వత్ రోడ్, సేలు, పార్టూర్, రోటేగావ్ మరియు వాషిమ్ స్టేషన్లలో ప్లాట్‌ఫారాల మొత్తం పొడవును కవర్ చేయడానికి జ్యూ పొడిగింపుతో అనుసంధానం నాందేడ్ డివిజన్. అంచనా వేయబడిన ప్రాజెక్ట్ ధర : రూ.1,44,90,522/-. బిడ్ సెక్యూరిటీ : రూ. 2,89,800/-. పని పూర్తి చేయడానికి పట్టే కాలం: 12 నెలలు. బిడ్ ముగింపు తేదీ (బిడ్ గడువు తేదీ): 09-07-2026, మధ్యాహ్నం 3:00 గంటలకు. బిడ్ ప్రారంభ తేదీ: 09-07-2026 తర్వాత 15:00 గంటలు. ఆఫర్ చెల్లుబాటు: బిడ్ ముగింపు తేదీ నుండి 60 రోజులు. ఖర్చు టెండర్ బుక్‌లెట్: రూ.0/-

బిడ్డింగ్ అంతా ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో జరుగుతుంది. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. మరిన్ని వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చు.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్.**

**E-Tender Notice No. : N-SG-36-2026-27-EI-M-11, Dated: 16-06-2026** PUB/392

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డి.ఎస్.టి.ఇ / నాందేడ్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ సంఖ్య మరియు తేదీ : N-SG-36-2026-27-EI-M-11, తేది: 16-06-2026. పని పేరు: నాందేడ్ డివిజన్‌లో మేధా మేక్ యొక్క 02 స్టేషన్లలో (పూర్ణ మరియు చుడావా) EL సిస్టమ్స్ యొక్క నాలుగు సంవత్సరాల కాలానికి వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్. అంచనా ప్రాజెక్ట్ వ్యయం: రూ.74,85,891/-. బిడ్ సెక్యూరిటీ: రూ.1,49,700/-. పని పూర్తి చేసే కాలం: 48 నెలలు. బిడ్ ముగింపు తేదీ (బిడ్ గడువు తేదీ): 08-07-2026, 15:00 గంటలకు. బిడ్ ప్రారంభ తేదీ: 08-07-2026, 15:00 గంటల తర్వాత. చెల్లుబాటు: ఆఫర్ : బిడ్ ముగిసిన తేదీ నుండి 60 రోజులు. తేదీ. టెండర్ బుక్‌లెట్ ధర రూ.0-

బిడ్డింగ్ అంతా ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో జరుగుతుంది. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. మరిన్ని వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చు.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్.**

**E-Tender Notice No. : N-SG-36-2026-27-CCTV-15, Dated: 16-06-2026** PUB/393

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డి.ఎస్.టి.ఇ / నాందేడ్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ సంఖ్య మరియు తేదీ : N-SG-36-2026-27-CCTV-15, తేదీ: 16-06-2026. పని పేరు: ఏర్పాటు 85 రిలేలో వీడియో రికార్డింగ్ వ్యవస్థ గది, 71 స్టేషన్ మాస్టర్ గది, పైన నాందేడ్ డివిజన్. అంచనా వేయబడిన ప్రాజెక్ట్ ఖర్చు: రూ.2,67,13,135/-. వేలం వేయండి బిడ్ సెక్యూరిటీ: రూ.5,34,300/-. పని పూర్తి చేయడానికి పట్టే కాలం: 12 నెలలు. బిడ్ ముగింపు తేదీ (బిడ్ గడువు తేదీ): 08-07-2026, మధ్యాహ్నం 3:00 గంటలకు. బిడ్ ప్రారంభ తేదీ: 08-07-2026 తర్వాత 15:00 గంటలు. ఆఫర్ చెల్లుబాటు: బిడ్ ముగింపు తేదీ నుండి 60రోజులు. టెండర్ బుక్‌లెట్ ఖర్చు : రూ.0/-

బిడ్డింగ్ అంతా ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో జరుగుతుంది. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. మరిన్ని వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చు.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్.**

**E-Tender Notice No. : N-SG-36-2026-27-INT-18, Dated: 15-06-2026** PUB/394

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డి.ఎస్.టి.ఇ / నాందేడ్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ సంఖ్య మరియు తేదీ : N-SG-36-2026-27-INT-18, తేదీ: 15-06-2026. పని పేరు: నాందేడ్ డివిజన్‌లో బోల్దా సిర్లీ స్టేషన్ల మధ్య LC 155, ఆదిలాబాద్ - పింపల్‌ఖుటి స్టేషన్ల మధ్య LC 33 మరియు దినాగావ్ జల్నా స్టేషన్ల మధ్య LC 74 లను ప్రతిపాదిత ఇంటర్‌లాకింగ్ చేయడం. అంచనా ప్రాజెక్ట్ వ్యయం: రూ.2,03,76,397/-. బిడ్ సెక్యూరిటీ: రూ.4,07,500/-. పని పూర్తి చేసే కాలం: 12 నెలలు. బిడ్ ముగింపు తేదీ (బిడ్ గడువు తేదీ): 07-07-2026, మధ్యాహ్నం 3:00 గంటలకు. బిడ్ ప్రారంభ తేదీ: 07-07-2026, మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత. ఆఫర్ చెల్లుబాటు: బిడ్ ముగింపు తేదీ నుండి 60 రోజులు. టెండర్ బుక్‌లెట్ ధర: రూ.0/-

బిడ్డింగ్ అంతా ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో జరుగుతుంది. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. మరిన్ని వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చు.

**సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్.**


## రోడ్డు ప్రమాదంలో మహిళ కు తీవ్ర గాయాలు

**అనకాపల్లి (భారత శక్తి)** అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. నక్కపల్లి, ఎం.ఆర్.ఓ.కార్యాలయం సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ ను కారు ఢీకొంది. ఘటన సమయంలో కారులో నలుగురు ప్రయాణీకులు వున్నారు. ఒక మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు వైజాగ్ నుండి రాజమండ్రి వెళ్తుండగా ఘటన జరిగింది.


**Notice Inviting e-TENDER (through http://ireps.gov.in)** PUB/395

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, భారత రాష్ట్రపతి తరపున కింది పనుల కోసం సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తోంది.

క్ర.సం.: 1. టెండర్ ఆహ్వాన ప్రకటన నెం. : టెండర్ నెం. 02-2026-2027-E-GS-CN-GTL. పని పేరు : విద్యుత్ నిర్మాణం / గుంతకల్ : గుంతకల్ డివిజన్: యెర్రేడు మరియు పూడి స్టేషన్ల మధ్య కొత్త బైపాస్ లైన్ నిర్మాణానికి సంబంధించి, యెర్రేడు మరియు చెల్లూరు స్టేషన్ల మధ్య వివిధ ప్రదేశాలలో ఉన్న 33 kV, 11 kV HT మరియు LT లైన్ల ప్రస్తుత పవర్ లైన్ క్రాసింగ్‌ల తరలింపు/సవరణ, DTRల తరలింపు, మరియు సమాంతర లైన్ల సవరణ. వివరాలు: అంచనా వ్యయం: రూ. 5,39,16,297.20/-. అడ్వాన్స్ డిపాజిట్: రూ. 10,78,300.00/-. టెండర్ పత్రం ఖర్చు: ఏమీ లేదు. పూర్తి కాల వ్యవధి: 12 (పన్నెండు) నెలలు. తేదీ ముగింపు: 09-07-2026, 15:00 గంటలకు.

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in లోకి లాగిన్ అవ్వండి.
2. బిడ్ సెక్యూరిటీ / EMD IREPSలో ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా నగదు రూపంలో జమ చేయాలి లేదా భారతదేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు నుండి FA&CAO/C/SCకి అనుకూలంగా బ్యాంక్ గ్యారెంటీ బాండ్‌గా లేదా టెండర్ పత్రాలలో పేర్కొన్న విధంగా సమర్పించాలి. బ్యాంక్ గ్యారెంటీ బాండ్ అనెక్సర్-VIA ప్రకారం ఉండాలి మరియు బిడ్ చెల్లుబాటు కాలం తర్వాత 120 రోజుల పాటు చెల్లుబాటులో ఉండాలి.
3. టెండర్ గడువు ముగియడానికి పదిహేను రోజుల ముందు వరకు టెండరర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
4. టెండర్ సమర్పణ గడువు ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.

**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (నిర్మాణ శాఖ), సికింద్రాబాద్.**

**Notice Inviting e-TENDER (through http://ireps.gov.in)** PUB/396

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, భారత రాష్ట్రపతి తరపున కింది పనుల కోసం సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తోంది.

క్ర.సం.: 1. టెండర్ ఆహ్వాన ప్రకటన నెం. : టెండర్ నం. 03-2026-2027-E-GS- CN-GTL. పని పేరు: Electrical Construction / Guntakal : గుంతకల్ డివిజన్: యెర్రేడు మరియు పూడి స్టేషన్ల మధ్య కొత్త బైపాస్ లైన్ నిర్మాణానికి సంబంధించి, చెల్లూరు మరియు పూడి స్టేషన్ల మధ్య వివిధ ప్రదేశాలలో ఉన్న 33 kV, 11 kV HT మరియు LT లైన్ల ప్రస్తుత పవర్ లైన్ క్రాసింగ్‌ల మార్పు/సవరణ, DTRల మార్పు, మరియు సమాంతర లైన్ల సవరణ. వివరాలు: అంచనా వ్యయం: రూ. 3,48,71,598.87/-. అడ్వాన్స్ డిపాజిట్: రూ. 6,97,400.00/-. టెండర్ పత్రం ఖర్చు: ఏమీ లేదు. పూర్తి చేయడం కాల వ్యవధి: 12 (పన్నెండు) నెలలు. ముగింపు తేదీ 09-07-2026, 15:00 గంటలకు.

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.
2. బిడ్ సెక్యూరిటీ / EMD IREPSలో ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా నగదు రూపంలో జమ చేయాలి లేదా భారతదేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు నుండి FA&CAO/C/SCకి అనుకూలంగా బ్యాంక్ గ్యారెంటీ బాండ్‌గా లేదా టెండర్ పత్రాలలో పేర్కొన్న విధంగా సమర్పించాలి. బ్యాంక్ గ్యారెంటీ బాండ్ అనెక్సర్-VIA ప్రకారం ఉండాలి మరియు బిడ్ చెల్లుబాటు కాలం తర్వాత 120 రోజుల పాటు చెల్లుబాటులో ఉండాలి.
3. టెండర్ గడువు ముగియడానికి పదిహేను రోజుల ముందు వరకు టెండరర్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
4. టెండర్ సమర్పణ గడువు ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.

**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (నిర్మాణ శాఖ), సికింద్రాబాద్.**

A 459

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి,
https://www.ireps.gov.in
లేదా
www.scr.indianrailways.gov.in
వెబ్‌సైట్‌ను సందర్శించండి

## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి


**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి )ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఓ మహా జీవి నీ పెరువినగానే ఆశా తో ఉన్న రైతన్నలు ,,





అరక కేసి చూసి ఎర్రని మాగాణిలో యేవసం చేయడానికి సిద్ధమవుతాడు ,,తొలకరి చినుకలకు నేలా తడసి మట్టివాసన పరిమళం విదజిల్లుతుంటే, ఉదయించే రవి లాంటి రంగు కప్పుకొని అప్పుడే పుట్టిన పసిబిడ్డ లాంటి అతిసున్నితమైన శరీరంతో , పసుపు నింపుకున్న గౌరమ్మ తల్లి నుదుటన సింధూరం లాగ దుక్కులల్లో చీడపురుగుల పాలిట రుద్రుని లాగ 27కార్తెల మధ్య 6వ కార్తేవై మా దుక్కులల్ల దిక్కులను చూపించే ఓ,,ఆధునైన ఆరుద్రమా,,ఆ ,,,రుద్రుని అవతారంతో మాకు దర్శనమిచ్చినందుకు మీకు పాదభి వందనం ప్రకృతి చాలా గొప్పది , పర్యావరణాన్ని కాపాడుదాం సహజీవులకు బతుకునిద్దాం ,,,,.- విజయ్ తరాల, కేసముద్రం

## ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి మంత్రి అడ్లూరి

**ధర్మపురి నియోజకవర్గంలో 11 కొత్త ఆర్టీసీ రూట్లు**





జగిత్యాల, జూన్ 23 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ధర్మపురి నుంచి నిర్మల్, కరీంనగర్‌కు కొత్త బస్సు సర్వీసులను మంగళవారం ధర్మపురి బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మల్ ధర్మపురి మధ్య ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాయపట్నం, వెల్గటూర్, ధర్మారం, చొప్పదండి మీదుగా కరీంనగర్‌కు కొత్త బస్సు సర్వీస్ ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సహకారంతో ధర్మపురి నియోజకవర్గంలో కొత్తగా 11 రూట్లలో బస్సు సర్వీసులకు అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించి సంస్థ ఆదాయం పెంచేందుకు సహకరించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్ మాట్లాడుతూ కొత్తగా, ప్రారంభించిన సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, నాయకులు వేముల రాజుతో పాటు ధర్మపురి మున్సిపాల్ కౌన్సిలర్లు, జగిత్యాల డిపో మేనేజర్ రమేష్, నిర్మల్ డిపో మేనేజర్ పందరి, ఆర్టీసీ జగిత్యాల సీఐ శ్రీనివాస్, ఎఫ్ ఎం నిర్మల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న రకాల సాగుతోనే అధిక లాభాలు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, జూన్ 23 (భారత్ శక్తి): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలనే సాగు చేయాలని రైతులకు సూచించారు. గత యాసంగిలో రికార్డు స్థాయిలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ రైతులు అధికంగా యూరియా వినియోగించవద్దని, సన్న రకాల వడ్ల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఈ నెల 23 నుంచి 31 వరకు రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

## దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో నిర్మల్ వాసి మృతి.

**-మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు చర్యలు.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23( భారత శక్తి ): సారంగాపూర్ మండలం వైకుంఠపూర్ గ్రామానికి చెందిన లగ్గం జగదీశ్ (38) దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన కుటుంబ సభ్యులను, గ్రామస్థులను విషాదంలో ముంచెత్తింది. కుటుంబ పోషణ కోసం కొద్ది రోజుల క్రితం దుబాయ్‌కు వెళ్లిన జగదీశ్, అరబిక్ కోళ్ల ఫారంలో పని చేస్తున్న సమయంలో ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూన్ 18న మృతి చెందాడు. జగదీశ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్ల మంగళవారం వైకుంఠపూర్ గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య కవిత మాట్లాడుతూ, మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కంపెనీ నుంచి సరైన సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన స్వదేశ్ పరికిపండ్ల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం కల్పించారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తరలించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని, అలాగే కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కాగా, జగదీశ్‌కు భార్య కవితతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె, తల్లి ఉన్నారు. గతంలో దుబాయ్, సౌదీ అరేబియాలో పని చేసి స్వగ్రామానికి వచ్చిన ఆయన, వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. ఇటీవల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ వ్యయాలు, పిల్లల చదువుల ఖర్చులు పెరగడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలనే ఉద్దేశంతో మరోసారి గల్ఫ్ బాట పట్టినట్లు గ్రామస్థులు తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రొద్ద మారుతి, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ నాయకులు రమేష్, సదా అమృత్, గ్రామస్థులు దేవేందర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.కుటుంబ భారం మోసేందుకు గల్ఫ్ వెళ్లిన జగదీశ్.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకుంది.

## మంత్రి అడ్లూరి చొరవతో 15 ఏళ్ల తర్వాత బస్సు సర్వీసు పునరుద్ధరణ

**అబ్బాపూర్‌లో కొత్త బస్సు సర్వీసు ప్రారంభం**



జగిత్యాల్,జూన్ 23(భారత శక్తి ప్రతినిధి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో అబ్బాపూర్‌కు 15 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరించబడింది. మంగళవారం అబ్బాపూర్ గ్రామంలో నూతన బస్సు సర్వీసును మంత్రి ప్రారంభించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు బస్సు సౌకర్యాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను, పునరుద్ధరించిన ప్రభుత్వ పాఠశాలను మంత్రి ప్రారంభించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామస్థులు కృషి చేయాలని మంత్రి కోరారు.

## వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి

**- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలి**




ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి): జిల్లాలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకునే జాగ్రత్తల గురించి గ్రామాలలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు ప్రజలకు ప్రజలకు ప్రజలకు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ నియంత్రించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి రోజువారి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయి, ఏ రకమైన వ్యాధులతో బాధపడుతున్న వారు వస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, మందులు, టీకాల నిల్వల గదులను పరిశీలనచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, ఫార్మసిస్ట్ అనుష ల్యాబ్ టెక్నీషియన్ సందీప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత విద్యను అందించాలి

**- ఉపాధ్యాయులు కృషి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**




ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.మంగళవారం వెంకటాపురం మండలంలోని జవహర్‌నగర్ మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ల్యాబ్‌లను పరిశీలించిన విద్యార్థులు. ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంపొందించుకునేలా ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. లైబ్రరీని సందర్శించి, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జ్ అరుణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థాన తాత్కాలిక ఉద్యోగుల సంఘం ఏర్పాటు

**- అధ్యక్షుడిగా ఏఈఓ రఘు, ప్రధాన కార్యదర్శిగా సూపరింటెండెంట్ వెంకట ప్రసాద్**



భారత శక్తి, జూన్ 23 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణ కొరకు దేవస్థానంలో పని చేసే ఉద్యోగులతో తాత్కాలిక ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు తాత్కాలిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏఈఓ జి రఘు, ప్రధాన కార్యదర్శిగా సూపరింటెండెంట్ వెంకట్ ప్రసాద్, కోశాధికారిగా సూపరింటెండెంట్ డి నరేష్, ఆర్గనైజర్ గా ఉప ప్రధాన అర్చకులు శ్రీధర్ శర్మ, కార్యవర్గ సభ్యులుగా ఉప ప్రధాన అర్చకులు మాధవాచార్యులు, సీనియర్ అసిస్టెంట్లు రత్నదీప, ఎన్ నగేశ్, రికార్డు అసిస్టెంట్ డి శ్రవణ్, డోలక్ ఎం రామ తిరుపాల్, గోపాలకుడు బండ సత్యనారాయణ, అటెండర్ బి పాండు, హెల్పర్ యాదగిరి, డ్రైవర్ నాగులు ఎన్నికయ్యారు. త్వరలో నిర్వహించబడే సాధారణ సమావేశంలో శాశ్వత కార్యవర్గం ఎన్నిక చేయబడునని, అప్పటివరకు తాత్కాలిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు ఏమైనా ఉన్నచో పరిష్కరించబడునని వారు తెలిపారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో మొబైల్ ఫోన్లపై ఆంక్షలు

**మెస్, ల్యాబ్, తరగతి గదుల్లో వినియోగానికి నిషేధం.**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23:( భారత శక్తి )బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసర (ట్రిపుల్ ఐటీ)లో విద్యార్థుల మొబైల్ ఫోన్ వినియోగంపై అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అంతరాయం కలగకుండా ఉండేందుకు మెస్‌లు, ల్యాబ్‌లు, తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు పాఠాలపై పూర్తి దృష్టి సారించేందుకు, విద్యా వాతావరణాన్ని మరింత మెరుగుపర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే తరగతులు ముగిసిన అనంతరం హాస్టల్ గదుల్లో మొబైల్ ఫోన్లను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు.మొబైల్ ఫోన్లపై పూర్తి నిషేధం విధించినట్లు కొన్ని వర్గాలు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఇది వాస్తవానికి విరుద్ధమని సంస్థ అధికారులు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయానికి సహకరించాలని అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ పరిరక్షణే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశమని వివరించారు.

# ఎరువుల దుకాణాలపై పోలీసు బృందం తనిఖీలు



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి): జిల్లా కేంద్రంలోని ఎరువుల దుకాణాలపై డిసిఆర్ బి డిఎస్పి ఈ. కిషోర్ బాబు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, పోలీసు సిబ్బంది తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి నోట్లు ఎస్సై బి చంద్రశేఖర్ తెలిపారు. ఎరువుల దుకాణాలలో విక్రయించబడుతున్న ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, విక్రయ రికార్డులను ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి, రైతులకు నాణ్యమైన ఎరువులను మాత్రమే విక్రయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను అమ్మాలని దుకాణ యజమానులకు వారు సూచించారు.అదేవిధంగా ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, నకిలీ ఎరువులను విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డీఎస్పీ శ్రీ ఈ. కిషోర్ బాబు మాట్లాడుతూ రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఏవైనా అక్రమాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు.రైతుల ప్రయోజనాల పరిరక్షణ, ఎరువుల సరఫరాలో పారదర్శకత కోసం ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వారు తెలిపారు.

## శివంపేటలో 15 ఏళ్ల బాలిక బాల్య వివాహాన్ని అడ్డుకొనుటకు ఉత్తర్వులను జారీచేసిన నర్సాపూర్ కోర్టు

**బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు**



మెదక్, నర్సాపూర్, జూన్ 23, (భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ తాలూకా శివంపేట మండలంలో 15 సంవత్సరాల మైనర్ బాలికకు జరగబోతున్న బాల్య వివాహాన్ని నిలిపివేస్తూ నర్సాపూర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నిషేధాజ్ఞ ఉత్తర్వులను (ఇంజక్షన్ ఆర్డర్) జారీ చేసింది. బాల్య వివాహాల నిషేధ చట్టం--2006 ప్రకారం శిశు సంక్షేమ శాఖ ద్వారా కోర్టులు నమోదైన ఫిర్యాదును పరిశీలించి ఈ ఉత్తర్వులు 23-06-2026న జూనియర్ సివిల్ డెడ్ కోర్టు జారీ చేసింది. మెదక్ జిల్లా బాలల సంక్షేమ న్యాయ సలహాదారు ఎం. బాలనర్సింలు తెలిపిన వివరాల ప్రకారం, బాల్య వివాహాల నిషేధ అధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు, 15 ఏళ్ల మైనర్ బాలికకు వివాహం జరిగే అవకాశం ఉందని గుర్తించి ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం బాలిక తల్లిదండ్రులు, కాబోయే వరుడు అతని తల్లిదండ్రులు బాల్య వివాహం నిర్వహించడం లేదా అందులో పాల్గొనడం నిషేధించబడింది. అలాగే కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)కు ఆదేశాలు జారీ చేసింది.కోర్టు ఉత్తర్వులను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే, వారి మీద చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేసింది.బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనలో న్యాయవ్యవస్థ సంబంధిత అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారని న్యాయ సహాయ న్యాయవాది ఎం. బాలనర్సింలు తెలిపారు. ప్రతి చిన్నారికి భారత రాజ్యాంగం ద్వారా విద్య, ఆరోగ్యం, భద్రతతో కూడిన బాల్యాన్ని అనుభవించే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు.సమాజంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని వారి బంగారు భవిష్యత్తును కాపాడడం కోసం బాల్య వివాహాలను నిర్మించుటకు ప్రతి ఒక్కరు కంకణబద్దులు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు విజ్ఞప్తి:ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు లేదా జరగబోతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 24 గంటలు పనిచేసే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1098 కు ఫోన్ చేయాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కమిటీ (సిడబ్ల్యుసి), బాల్య వివాహాల నిషేధ అధికారికి సమాచారం అందించాలని కోరారు.

## నకిలీ పత్రాలతో ఇల్లు రిజిస్ట్రేషన్.

**అన్నతో పాటు సహకరించిన ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్ట్.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 23: తప్పుడు పత్రాలు సృష్టించి తమ్ముడికి చెందిన ఇల్లును తన భార్య పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిని, అతనికి సహకరించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను చందుర్తి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చందుర్తి ఎస్సై జిల్లెల రమేష్ తెలిపిన వివరాల ప్రకారం...చందుర్తి మండలం సనుగుల గ్రామానికి చెందిన పులి నవీన్‌కు, అతని అన్న పులి శ్రీకాంత్‌కు మధ్య ఉమ్మడి ఇల్లు ఉంది. అయితే, తన అన్న ఆ ఇంటిని అక్రమంగా పట్టా చేయించుకోవాలని చూస్తున్నాడనే అనుమానంతో నవీన్ 'మీ సేవా' కేంద్రంలో ఈసీ తీసి పరిశీలించాడు. ఆ ఇల్లు అప్పటికే తన అన్న భార్య పేరిట రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించి షాక్‌కు గురయ్యాడు. దీనిపై సనుగుల గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా.. తాము ఎలాంటి ఇంటి పట్టా జారీ చేయలేదని స్పష్టం చేశారు. అనంతరం చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో విచారించగా, అక్కడ కూడా ఎలాంటి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని తేలింది. బాధితుడు నవీన్ తన అన్న శ్రీకాంత్ చేసిన మోసాన్ని గుర్తిస్తూ చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లిదండ్రుల డెత్ సర్టిఫికెట్, కుటుంబ ధ్రువీకరణ పత్రం, ఇంటి పన్ను రసీదులు, రిజిస్ట్రేషన్ ప్లాన్ సాక్షుల ఆధార్ కార్డులను నకిలీవిగా సృష్టించి, తనను మోసం చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై జిల్లెల రమేష్ దర్యాప్తు చేపట్టి, నిందితుడైన అన్న పులి శ్రీకాంత్‌తో పాటు అతనికి నకిలీ పత్రాలు, రబ్బర్ స్టాంపులు తయారు చేయడంలో సహకరించిన కల్లేపల్లి శేఖర్ (ఫీల్డ్ అసిస్టెంట్)ను అరెస్ట్ చేశారు. పంచుల సమక్షంలో శేఖర్ వద్ద నుంచి నకిలీ రబ్బర్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ పత్రాలను స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరినీ జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన చందుర్తి ఎస్సై జిల్లెల రమేష్‌తో పాటు, దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బంది ప్రమోద్ కుమార్, కరుణాకర్, మనోహర్, ప్రవీణ్, రవిలను సీఐ రవీందర్ ప్రత్యేకంగా అభినందించారు.

# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి.

**-రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 23 (భారతశక్తి): రైతుల సంక్షేమాన్ని పెద్దపీట వేస్తూ.. ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాధపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి ప్రామాణికతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. యూరియా బుకింగ్‌ను కూడా యాప్ ద్వారా నిర్వహిస్తున్నామని, రైతులు



ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా బుకింగ్ యాప్, విత్తనమేలపై రైతులలో అవగాహన కలిగించాలని వ్యవసాయ శాఖ అధికారులని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు



తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, వ్యవసాయ అవసరాలన్నీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ చేతులమీదుగా విత్తనాలు, యూరియా అందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సోసిటీ ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, తాసిల్దార్ ధారా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

**- ఎస్పీ రోహిత్ రాజు**

**-గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు**

భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 23 (భారతశక్తి): జిల్లాలోని పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గల బాలుర గురుకుల పాఠశాలలో ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పి రోహిత్ రాజు పాఠశాల విద్యార్థుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించి, అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక లాంటివారు, క్షణకాలపు ఆనందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై, తమ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, వైజ్ఞానిక పరిజ్ఞానం పిల్లలకు అవసరమని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి నుండి ఉపశమనానికై క్రీడలపై ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు,



ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. సైబర్ నేరాల వలన అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని, చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా జిల్లాలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర సమయాల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచనలు చేశారు. అనంతర




రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. సుమారు 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్. సతీష్ కుమార్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు, పాఠశాల, కళాశాల, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**

కడప, జూన్ 23(భారత శక్తి ): వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాల్లో రైతులకు అందుతున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకుని, సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి తెలిపారు.మంగళవారం చెన్నూరు మండలం రామన్నపల్లె రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సలహాలు, పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్న "రైతన్నా మీకోసం" వారోత్సవాల్లో భాగంగా రైతులకు వ్యవసాయ అధికారులు.. సాగుబడిలో మెళుకువలను, ప్రభుత్వం ద్వారా అందే రైతు రాయితీలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యాన, పాడి రంగాలను పటిష్టం చేసేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లా యంత్రాంగం రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం నిరంతరం సహాయ సహకారాలు అందించేందుకు అందుబాటులో ఉందన్నారు.

**షేడ్ నెట్ హౌస్ నర్సరీ పరిశీలన..**

అంతకుముందు కడప నగర గ్రామీణ పరిధిలోని పాలెంపల్లె గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "షేడ్ నెట్ హౌస్" నర్సరీని కలెక్టర్ పరిశీలించారు. రాష్ట్ర ఉద్యాన శాఖ, జాతీయ ఉద్యాన పంటల మిషన్ సహకారంతో 50 శాతం



రాయితీపై రూ.22.70 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ నర్సరీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యాన రైతులకు వ్యాధి నిరోధక, నాణ్యమైన మొక్కల సరఫరాలో ఇటువంటి నర్సరీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

**- రైతు డిపోలో ఎరువుల పంపిణీ విధానం తనిఖీ..**

చెన్నూరు మండల కేంద్రంలోని సుప్రియ రైతు డిపోను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, నూతనంగా అమలులోకి వచ్చిన వ్యవసాయ సమాచార నిర్వహణ అనువర్తనం ద్వారా రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ విధానం పారదర్శకంగా, సులభంగా సాగుతోందని పేర్కొంటూ రైతుల అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. డిపోలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తదితర నిల్వలు, ధరలు, నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు.

**- పశువైద్యశాల, గ్రామ సచివాలయాల ఆకస్మిక తనిఖీ..**

రామన్నపల్లెలోని పశువైద్యశాల, గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. పశువైద్యశాలలో మందుల నిల్వలు,



మౌలిక సదుపాయాలను తనిఖీ చేసి పశుపాలకులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామ సచివాలయంలో పౌర సేవల తీరుపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సంక్షేమ పథకాలు సజావుగా అందుతున్నాయా లేదా అని అడుగుతూ.. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, పౌరసేవలపై ప్రజల సంతృప్తి శాతాన్ని కూడా తెలుసుకున్నారు.

**- ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు..**

ఖాజీపేట మండలంలోని చెముళ్లపల్లెలో సూక్ష్మ సేద్యం ద్వారా సాగు చేస్తున్న అరటి తోటలను, పాటిమీదపల్లెలో బొప్పాయి, పూల తోటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఉద్యాన పంటలకు అనుకూల వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావాలని, దీర్ఘకాలిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రైతులకు సరైన విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించాలి

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



రేగొండ, జూన్ 23 (భారత శక్తి) రేగొండ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత మరియు రానున్న వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.రైతులకు అధిక లాభాలు అందించే సన్న వడ్ల రకాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ ఏడాది వర్షపాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై కూడా రైతులకు సూచనలు ఇవ్వాలని వ్యవసాయ, హార్టికల్చర్ శాఖ అధికారులకు సూచించారు.పంట మార్పిడి విధానాన్ని రైతులు అనుసరించేలా ప్రోత్సహించాలని, సరైన విత్తనాల ఎంపికలో రైతులకు మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వారి వెంట పలువురు నాయకులు రేగొండ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు
# కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

- కల్తీ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా అవసరం
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్సైజ్ శాఖ పనిచేయాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్ (భారత శక్తి)**ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు శాఖ సిబ్బంది హాజరయ్యారు. సమావేశంలో గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అలాగే కల్తీ మద్యం తయారీ, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు.ఎక్సైజ్ శాఖ విధులు నిర్వర్తించే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజల భద్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.అక్రమ మాదకద్రవ్యాలు, కల్తీ మద్యం నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.

## నీటి లభ్యత ఉన్న రైతులు
# సన్న వడ్లను పండించాలి



**సిద్దిపేట(భారత శక్తి)** జిల్లాలో ఎల్ నీనో ప్రభావం మొదలైందని నీటి లభ్యత ఉన్న రైతులు సన్న వడ్లను పండించాలని కలెక్టర్ కె. హైమావతి అన్నారుకలెక్టర్ మాట్లాడుతూ వర్ష బావ లోటు ఉన్న ప్రాంతాల్లో పప్పు దినుసులు, కూరగాయలు మాత్రమే వెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల రైతువేదికలో వ్యవసాయ శాఖ వారు నిర్వహించిన విత్తన మేళ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ముందుగా రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా అన్ని రైతు వేదికలలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి రాష్ట్ర రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర మొత్తంలో అన్ని రైతు వేదికలలో సబ్సిడీతో జూన్ నేటి నుండి జూన్ 30 వరకు విత్తనాల పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.భారత వాతావరణశాఖ ఎల్ నీనో ప్రభావం మొదలైందని హెచ్చరించడం జరిగిందని దీని వలన వర్షాభావ పరిస్థితులు ఉంటాయని అనుకూలమైన వర్షాలు ఉండవని ఎక్కువ శాతం రైతులు వరి పండిస్తున్నారని దీనికి సక్రమమైన సమయంలో వర్షాలు లేకపోవడం వలన పంట ఎండిపోయి దిగుబడి తగ్గుతుందని కాబట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు కొన్ని రకాల విత్తనాలను ఎంపిక చేస్తారని నీటి పారుదల ఎక్కువ ఉన్న రైతులు సన్న వరి పండించాలని ఏడు రకాల సన్నవడ్ల విత్తనాలను వేసుకోవాలని సూచన చేయడం జరిగింది. వర్షా భావ పరిస్థితిలో ఉన్న ప్రాంతాల్లో పప్పు దినుసులు, నూనె గింజలు, కంది, మినుము, పెసర, మిల్లెట్స్, కూరగాయలు ఇలాంటివి అన్ని కూడా పండించాలి తెలియజేయడం జరిగిందని తెలిపారు. వర్షాబావ పరిస్థితిలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ కూడా నారుమడులు కూడా వేసుకోలే కాబట్టి మనకున్న వనరులను దృష్టిలో ఉంచుకొని వాతావరణం అనుకూలించే పంటలను పండించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయడం కోసం అన్ని రైతువేదిక లో విత్తనాలు కొనుగోలు చేయడం జరుగుతుందని విత్తన మేళ ఈరోజు నుండి 30వ తారీకు వరకు కొనసాగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.క్లస్టర్ పరిధిలోని రైతు చిన్ని శ్రీనివాస్ రెడ్డి 10 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో పూర్తి సంప్రదాయబద్ధంగా ఏలాంటి రసాయనాలు వాడకుండా పండిస్తున్న అరటి, పొప్పాయి, కోకో, మునగ తోటలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలో కలియ తిరిగారు. రసాయనాలు వాడకుండా ఎరువుల తయారీ విధానాన్ని, సూక్ష్మ నీటి సరఫరా గూర్చి రైతు వివరించారు. ఇలాగే సంప్రదాయబద్ధంగా చేస్తున్నందుకు అభినందిస్తూ జిల్లా రైతాంగానికి ఒక ఆదర్శంగా నిలవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఏఓ స్వరూప రాణి, ఏఈఓ మీరా, సర్పంచ్ లు అమ్ములు వెంకటయ్య, మౌనిక నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సృజన సంపత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారి ఆస్తులపై ఏసీబీ సోదాలు

**నిజామాబాద్ (భారత శక్తి)** నిజామాబాద్ ఎక్సజ్ అధికారి అవినీతి వ్యవహారంపై ఏసీబీ దృష్టిపెట్టింది. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెంట్ మల్లారెడ్డి నివాసాల్లో బంధువుల ఇళ్లలో కూడా ఏసీబీ సోదాలు చేపట్టింది. నిజామాబాద్ లోని కార్యాలయం, నివాసం, హైదరాబాద్ మచ్చబోల్లారంలో ఉన్న నివాసం సహా మొత్తం పదకొండు చోట్ల ఏసీబీ అధికారులు సిబ్బంది మంగళవారం ఉదయం నుండి సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం .

## మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే
# లక్ష్యంతో ఇందిరమ్మ చీరల పంపిణీ

- డాక్టర్ కోట నీలిమ

**(భారత శక్తి)** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని పెంచే లక్ష్యంతో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ తెలిపారు. సనత్ నగర్ డివిజన్ లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో టీసీ సుజాత, డీపీవో మాలతి, సినో మస్పయ్యతో కలిసి స్థానిక మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రతి మహిళకు చీర అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటివి మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నారని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన వారందరికీ చీరలు పంపిణీ జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజ్జు, రవికాంత్, ప్రమోద్, అడ్డుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖమ్మం ఘటన బాధిత బాలికను
# పరామర్శించిన ఎన్ హెచ్ ఆర్ సి కమిషన్

**హైదరాబాద్ (భారత శక్తి)** నిమ్స్ ఆస్పత్రికి నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ విజయభారతి వచ్చారు. ఖమ్మం ఘటన బాధిత బాలికను పరామర్శించారు.విజయ భారతి మాట్లాడుతూ పాప పరిస్థితి అత్యంత దయనీయం గా ఉంది.వెన్ను ముక్క పూర్తిగా చితికి పోయిన కారణంగా పాప జీవితాంతం వీల్ చైర్ కే పరిమితం అవుతుందని డాక్టర్లు తెలియజేసారు. పాప ను నిమ్స్ డాక్టర్ల ప్రత్యేక బృందం అనుక్షణం పర్యవేక్షిస్తున్నారు. పాప పూర్తి ఆరోగ్య పరిస్థితి సమగ్రంగా రిపోర్ట్ తీసుకున్నాము. పాప తల్లిదండ్రులు నిరక్ష్యారాస్యులు. ఎలా పాప ను జీవితాంతం చూసుకుంటావు అన్న ప్రశ్న కు ప్రభుత్వం సహాయం కావాలని బదులోచిందని అన్నారు.సంఘటన జరిగిన భవనం, స్థలాన్ని సందర్శిస్తాము.సమగ్ర నివేదిక తో ఢిల్లీ కి వెళ్ళాక పాప విషయం లో ఒక నిర్ణయానికి వస్తాం. పాపకు జరిగిన అన్యాయం ఆమె మీద జరిగిన క్రూరమయిన దాడి ని ఖండిస్తున్నాం. నేరస్థులకు శిక్ష ఖచ్చితంగా పడుతుంది. పాప కు న్యాయం చేసేంతవరకు వరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ పాపకు అండగా ఉంటుందని అన్నారు.

# యూరియా యాప్ నిరసన

**హైదరాబాద్ (భారత శక్తి)**మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు.. ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధంలో ఉంచారు. వివరాల్లోకి వెళితే... 'యూరియా యాప్' వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఒక భారీ రైతు ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి సురేందర్ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయల్దేరేందుకు వేముల సిద్ధమవగా... పోలీసులు ఆయనను నిలువరించారు. ఆయనను గృహ నిర్బంధం చేశారు.

# ఏసీబీ చేతిలో అవినీతి తిమింగళం

**హైదరాబాద్ (భారత శక్తి):** తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటను యాంటీ కరప్షన్ బ్యూరో మరింత ఉధృతం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే నమ్మదగిన సమాచారంతో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మల్లా రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఏకకాలంలో మెరుపు దాడులు ప్రారంభించారు. మల్లా రెడ్డి అక్రమాస్తుల గుట్టు రట్టు చేసేందుకు ఏసీబీ ఏకంగా 11 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. హైదరాబాద్‌లోని మాచ బొల్లారంలో ఉన్న ఆయన నివాసంతో పాటు నిజామాబాద్‌లోని ఆయన కార్యాలయం, నివాసాలపై అధికారులు విరుచుకుపడ్డారు. వీటితో పాటు మల్లా రెడ్డికి అత్యంత ఆప్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీలుగా అనుమానిస్తున్న వారి ఇళ్లు, వ్యాపార సంస్థల్లోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.తన అధికారిక ఆదాయ వనరులకు మించి మల్లా రెడ్డి భారీగా ఆస్తులను కూడబెట్టారనే బలమైన ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. ప్రాథమిక దర్యాప్తులో ఆయన పెద్ద ఎత్తున అక్రమ సంపాదనకు పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో, కోర్టు అనుమతితో ఈ సర్ప్రైజ్ రైడ్స్ ప్లాన్ చేశారు. సోదాల సందర్భంగా అధికారులు ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంక్ పాస్‌బుక్కులు, బంగారు ఆభరణాలు, భారీగా నగదును గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంకు లాకర్ల వివరాలు మరియు ఇతర ఆర్థిక లావాదేవీల రికార్డులను ఏసీబీ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మల్లా రెడ్డి సర్వీస్ కాలంలో సంపాదించిన చట్టబద్ధమైన ఆదాయానికి, ప్రస్తుతం దొరికిన ఆస్తుల విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కగట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారుఒక కీలక జిల్లాకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అధికారి నివాసాలపై ఈ స్థాయిలో ఏసీబీ దాడులు జరగడం కలకలం రేపుతోంది. సోదాలు పూర్తిగా ముగిసిన తర్వాత మల్లా రెడ్డి అక్రమాస్తుల అసలు విలువ ఎంత? ఎక్కడెక్కడ బినామీల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశారు? అనే పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని ఏసీబీ ఉన్నతాధికారులు తెలిపారు. అక్రమాలు రుజువైతే ఆయనపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రభుత్వం మెడికల్ కళాశాల అడ్డుకున్న
# చంద్రబాబు గో బ్యాక్

- పశ్చిమ ప్రాంత ప్రాజెక్టులు చంద్రబాబుకు పట్టవా...
- పశ్చిమ ప్రాంత అభివృద్ధికై స్పష్టమైన హామీ తర్వాతే కర్నూలుజిల్లాలో చంద్రబాబు పర్యటించాలి
- పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై స్పష్టత ఇవ్వకపోతే చంద్రబాబు పర్యటన అడ్డుకుంటాం.....
- పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు...




**ఎమ్మిగనూరు(భారత శక్తి)** ఎమ్మిగనూరు కర్నూలు పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాల ను అడ్డుకున్న చంద్రబాబు అడుగుపెట్టడానికి అర్హత లేదని పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయం లో వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతం దశాబ్దాల కాలం నుంచి ఎంతో వెనుకబడింది అని విజన్ అని చెప్పుకునే వ్యక్తికి పశ్చిమ ప్రాంత అభివృద్ధి ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. పశ్చిమ ప్రాంత ప్రజల ఆరోగ్యాలరీత్యా గత ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేస్తే ఆ కాలేజీని ప్రైవేటుపరం చేసి పశ్చిమ ప్రాంత ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడటం చాలా దారుణమని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలో నడుపుతామని హామీ ఇచ్చిన తర్వాతనే పశ్చిమ ప్రాంతంలో చంద్రబాబునాయుడు అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని చాలా దారుణమని అన్నారు. తక్షణమే నారా చంద్రబాబు నాయుడు పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రేపు జరగబోయే చంద్రబాబు నాయుడు పర్యటనను పశ్చిమ ప్రాంత రైతుల అభ్యున్నతి కోసం పశ్చిమ ప్రాంతా విద్యారంగ అభివృద్ధి కోసం ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు పట్టణ కార్యదర్శి నరసింహారెడ్డి, నాయకులు వినోద్, సాయి, గోవర్ధన్, ధనుష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాధాగాయత్రి భర్తపై కేసు నమోదు

**విశాఖపట్టణం(భారత శక్తి)** ఇటీవల మృతిచెందిన వైజాగ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాధా గాయత్రి కేసులో ఉత్తరాఖండ్ పోలీసులు చర్యలు చేపట్టారు. మృతురాలి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆమె భర్త శ్రీచరణ్‌పై మసూరీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మసూరీలో అనుమానాస్పద స్థితిలో రాధా గాయత్రి చనిపోవడం తెలిసిందే. ఈ కూతురు రాధా గాయత్రి భర్త శ్రీ చరణ్ తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారని, ఆమె మరణానికి కారణమయ్యే కొన్ని రకాల మందులను వాడేలా ఒత్తిడి తెచ్చాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. గాయత్రి చనిపోయిన తర్వాత ఆమె కుటుంబ సభ్యులకు శ్రీచరణ్ రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో ముస్సోరి పోలీసులు పేర్కొన్నారు.శ్రీచరణ్, రాధాగాయత్రిలు గురుగ్రామ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. వీరికి గతేడాది నవంబరులోనే వివాహం జరిగింది. ఇటీవల వీరిద్దరూ ఉత్తరాఖండ్ టూర్‌కి వెళ్లారు. ఈ క్రమంలో జూన్ 14న మసూరీలోని ఒక హోమ్‌స్టేలో బస చేయగా, అక్కడ రాధా గాయత్రి అనుమానాస్పద రీతిలో చనిపోయింది. ఆమె ముక్కు నుంచి రక్తం వచ్చినట్లు మసూరీ పోలీసులు గుర్తించారు. మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినప్పటికీ, మృతురాలి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాలతో ఆమె భర్తపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. రాధా గాయత్రి మృతిపై ఆమె తండ్రి సుధాకర్ శనివారం మసూరీ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కుమార్తె మరణానికి సంబంధించి అల్లుడు శ్రీచరణ్‌పై పలు సంచలన అనుమానాలు వ్యక్తం చేశారు. కేవలం రుషికేశ్, హరిద్వార్ టూర్‌లకు వెళ్తున్నామని చెప్పారని, ఉత్తరాఖండ్ (మసూరీ)కి వెళుతున్నట్లు తమకు చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో జూన్ 14వ తేదీ అర్ధరాత్రి 1.38 గంటల సమయంలో భార్యాభర్తలిద్దరూ సన్నిహితంగా ఉన్న ఒక సెల్ఫీ ఫొటోను అల్లుడు పంపాడని తెలిపారు. ఎప్పుడూ లేనిది ఇంత అర్ధరాత్రి ఫొటో పంపడం ఏంటని తాము అనుకున్నట్లు పేర్కొన్నారు. తాము బంగీజంప్‌కు వెళ్లామని శ్రీచరణ్ చెబుతున్నాడని, అందుకు సంబంధించిన ఒక్క ఫొటో, సాక్ష్యాలు కూడా వారి ఫోన్లలో లేవన్నారు. తన కుమార్తె రాధా గాయత్రి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తప్పు చేసిన వారిని శిక్షించాలని తండ్రి నాగరాజు తన ఫిర్యాదులో కోరారు.పోలీసులు ప్రస్తుతం భార్యాభర్తలిద్దరి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి పంపిన సెల్ఫీ ఫొటో వెనుక ఉన్న టైమ్‌స్టాంప్ నిజమైందేనా లేక గాయత్రి చనిపోయిన తర్వాత ఫోటోను క్రియేట్ చేశారా అనే కోణంలో సైబర్ క్రైమ్ టీమ్ విచారిస్తోంది.సెక్షన్ 307 కింద కేసు నమోదు: ప్రాథమిక ఆధారాలు, మందుల దుర్వినియోగం ఆధారంగా పోలీసులు శ్రీచరణ్‌పై బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఒకవేళ పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో విషప్రయోగం లేదా ఊపిరాడకుండా చేసి చంపినట్లు తేలితే హత్య కేసు (ఓబీతీటవతీ అజీబవ)గా మారుస్తారు.మహిళలపై గృహహింస – హెల్ప్‌లైన్: వివాహమైన కొద్ది నెలలకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రాధా గాయత్రి ఇలా అనుమానాస్పదంగా మృతి చెందడం విశాఖలో విషాదాన్ని నింపింది. అయితే గృహహింస లేదా మానసిక వేధింపులకు గురయ్యే మహిళలు సహాయం కోసం జాతీయ మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181 లేదా పోలీసు హెల్ప్‌లైన్ నంబర్ 112ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు అరెస్ట్!

- తీవ్ర ఉద్రిక్తతల మధ్య అదుపులోకి తీసుకున్న సిట్

**విజయవాడ (భారత శక్తి)** సంచలనం రేపిన సాయికృష్ణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయమే సిట్ అధికారులు విజయవాడలోని సీఐ నాగరాజు ఇంటికి వెళ్లారు. అయితే సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దంటూ ఆయన మద్దతుదారులు ఉదయం నుంచి ఇంటి వద్ద ఆందోళకు దిగారు. అయితే పోలీసు సాయంతో సిట్ అధికారులు సీఐ నాగరాజును నివాసంలోకి అతికష్టం మీద వెళ్లారు. కేసు విషయమై కొన్ని గంటలపాటు ప్రశ్నించిన అనంతరం సిట్ అధికారులు సీఐ నాగరాజును అదుపులోకి తీసుకుని పోలీస్ గెస్ట్ హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడికి తీసుకెళ్లి సాయికృష్ణను కస్టడీకి ఎప్పుడు తీసుకున్నారు, ఏం జరిగిందని సిట్ అధికారులు పూర్తి స్థాయిలో విచారించనున్నారు.నాగరాజును అదుపులోకి తీసుకునేందుకు సిట్ అధికారులు ముందుగానే వాహనం సిద్ధం చేసుకుని రావడంతో సీఐకి మద్దతుగా భారీ ఎత్తున స్థానికులు, మద్దతుదారులు వచ్చారు. నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉందని, అదుపులోకి తీసుకుంటారేమోనని గత మూడు రోజులుగా మాజీ సీఐ ఇంటి వద్దకు మద్దతుదారులు వచ్చి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ సైతం నిర్వహించడం తెలిసిందే. ఆయన వల్లే ఏరియాలో మహిళలు ధైర్యంగా బయట తిరుగుతున్నారని, సీఐ నాగరాజు వచ్చాకే పరిస్థితిలో చాలా మార్పుల వచ్చిందన్నారు. సాయికృష్ణ అదృశ్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను ముమ్మరం చేసింది. సిట్ సభ్యులు సోమవారం (జూన్ 22న) కృష్ణలంకలోని సాయికృష్ణ నివాసం, పోలీస్ స్టేషన్, స్వర్గపురి శ్మశానవాటికలను స్వయంగా పరిశీలించారు. సాయికృష్ణ తల్లితో పాటు మేనమామలు, కుటుంబ సభ్యులను సుమారు 6 గంటల పాటు విచారించి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. పోలీసులు సాయికృష్ణను స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టి చంపేసి, ఆధారాలు లేకుండా మృతదేహాన్ని దహనం చేశారని కుటుంబ సభ్యులు సిట్‌కు తెలిపారు.అనంతరం క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందంతో కలిసి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సిట్ అధికారులు ఆమూలాగ్రం తనిఖీ చేశారు. సిబ్బంది స్టేట్‌మెంట్లు, వేలిముద్రలను సిట్ అధికారులు సేకరించారు. శ్మశానవాటిక వద్ద కాపరిని కూడా విచారించి, పరిసరాల్లోని సీసీ కెమెరాల వివరాలను ఆరా తీశారు.

**సీసీటీవీ ఫుటేజీలు మాయం కావడంతో ఉత్కంఠ..**అయితే, సాయికృష్ణ కేసులో అత్యంత కీలకమైన పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలు మాయమవడంతో ఏం జరుగుతుందోనని ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం 18 నెలల ఫుటేజీ భద్రపరచాల్సి ఉండగా, దాదాపు ఏడాది కాలపు దృశ్యాలను తొలగించినట్లు సిట్ గుర్తించింది. కోర్టు ఆదేశాల ప్రకారం హార్డ్ డిస్క్, డీవీఆర్‌లను సీజ్ చేసి పరిశీలించగా.. కేవలం 2 రోజుల ఫుటేజీ మాత్రమే లభ్యమైంది. కేసు నుంచి తప్పించుకునేందుకు మాజీ సీఐ నాగరాజు స్థానిక టెక్నీషియన్‌తో ఈ వీడియోలను తొలగించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సిట్ అదికారులు డేటా రికవరీ కోసం ఈ డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఏపీ ప్రభుత్వం ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ఐజీ ఎం.రవిప్రకాశ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్‌లను సిట్ సభ్యులుగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే అదేరోజు సీఐ నాగరాజును అరెస్ట్ చేస్తారని ప్రచారం జరగగా, ఆయనకు మద్దతుగా రాత్రిపూట కొందరు మహిళలు స్థానికంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

## రూ.195 కోట్ల దారి మళ్లింపు..
# ఎన్నికల ఖర్చులు

**విజయవాడ (భారత శక్తి):** ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జరుపుతున్న దర్యాప్తులో పురోగతి లభించింది. లిక్కర్ స్కామ్ కేసు నిందితుల ఇళ్లలో జరిపిన సోదాల్లో ఒక హవాలా నంబర్ కరెన్సీ నోటు ముక్క అధికారులకు దొరికింది. దీని ఆధారంగా అనేక సీక్రెట్ ట్రాన్సాక్షన్ పై దర్యాప్తు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆఖూఃఅఒ) డిపోల నుండి మద్యం సరఫరాలో పెద్దఎత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ఈడీ ఇప్పటికే కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్ కేసిరెడ్డిలతో పాటు ఏపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను అధికారులు ఇదివరకే అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా సునీల్ కుమార్ ఫోన్‌ను పరిశీలించినప్పుడు, ఒక కరెన్సీ నోటు ముక్క ఫొటోను ఒక నిర్దిష్ట నంబర్‌కు పంపినట్లు అధికారులు గుర్తించారు.ఈ మొత్తం కుంభకోణం విలువ రూ.195 కోట్లుగా ఈడీ ప్రాథమికంగా లెక్కగట్టింది. వైసీపీ ప్రభుత్వంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా మద్యం సరఫరా కాంట్రాక్టును సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్‌కు కట్టబెట్టారు. సిగ్మా సంస్థ నుండి వల్లు సందీప్‌కు చెందిన సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌కు సబ్ కాంట్రాక్టు దక్కగా, అక్కడి నుండి నిధులు సునీల్ కుమార్‌కు చేరాయని ఈడీ గుర్తించింది. ఈ నిధులను సునీల్ కుమార్ హవాలా ద్వారా దారి మళ్లించి ఆస్తులు కూడబెట్టారని, అలాగే గత ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఖర్చు చేశారని ఈడీ అనుమానిస్తోంది. ఇప్పటివరకు హవాలా జరిగినట్లు అనుమానాలున్నా, ఈ నోటు ముక్క ఫొటో దొరకడంతో తిరుగులేని ఆధారం లభించినట్లయింది. ఈ ఫొటోను ఎవరికి పంపారో గుర్తిస్తే మరిన్ని ఆస్తులు, లావాదేవీల చిక్కుముడులు వీడనున్నాయి.

**హవాలా నెట్‌వర్క్ పనితీరు, విచారణ**సాధారణంగా హవాలా మార్గంలో లెక్కల్లోకి రాని బ్లాక్ మనీ బదిలీ చేయడానికి ఇలాంటి సగం కరెన్సీ నోటు ముక్కల ఫొటోలను టోకెన్లుగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు, హైదరాబాద్ నుండి ఢిల్లీ లాంటి నగరాలకు మాత్రమే కాదు, విదేశాలకు అనధికారికంగా డబ్బు పంపాలనుకుంటే, ఇక్కడి ఏజెంట్‌కు నగదు ఇచ్చి, ఆయన ఇచ్చే నోటు ముక్క ఫొటోను అవతలి వారికి పంపుతారు. అక్కడ ఆ ఫొటోను చూపించడం, లేక మిగతా నోటు ముక్క చూపించి నగదును విత్‌డ్రా చేసుకుంటారు. ఈ పద్ధతిలోనే మద్యం స్కామ్ డబ్బును కూడా భారీగా దారి మళ్లించినట్లు ఈడీ భావిస్తోంది. ఈ వ్యవహారంలో మరింత లోతుగా విచారించేందుకు ఈడీ అధికారులు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు నోటీసులు జారీ చేయగా, ఆయన నేడు (జూన్ 23న) ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది.

## హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో
# లోటు ఉంది

### – సౌత్ ఇండస్ట్రీపై తమన్నా సంచలన వ్యాఖ్యలు!

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల–2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది. భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సౌత్ ఇండస్ట్రీలో కూడా తానే కాకుండా అనుష్క, నయనతార, సమంత వంటి వారు 10 నుంచి 15 ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నామంటే.. దానికి కారణం ఈ గ్లామర్, పెర్ఫార్మెన్స్ అనే రెండు విషయాలను పక్కాగా బ్యాలెన్స్ చేయడమేనని తమన్నా చెప్పుకొచ్చింది.



## ఘనంగా "నా గురించి నీకు తెలియాలి"
# మూవీ ప్రారంభం



జ్ఞానమ్మ కలివెల సమర్పణలో సంజన మూవీ మేకర్స్ పతకం పై విశ్వ, ఐశ్వర్య, అనూష హీరో హీరోయిన్లుగా వెంకటేష్ కలివెల ను దర్శకుడిగా పరిచయం చేస్తూ సంజన కలివెల నిర్మిస్తున్న "నా గురించి మీకు తెలియాలి" లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్టైన్మెంట్ చిత్రం ఇటీవల ప్రారంభం అయినది. హీరో హీరోయిన్లు పై చిత్రికారంచిన ముహూర్తము సన్నివేశానికి క్లాప్ అమిత్ తివారి, కెమెరా స్విచ్ ఆన్ కుమారి సంజన, వెంకటేష్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ నిర్వహించారు. ఈ సందర్బంగాదర్శకుడు వెంకటేష్ కలివెల మాట్లాడుతూ.... రొమాంటిక్ ఎంటర్టైన్మెంట్ తో సాగె ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అని ఈచిత్రంలో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లు ఉంటాయి, ముఖ్యంగా హీరో "నా గురించి నీకు తెలియాలి" అని చెప్పే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ సినిమాకె హైలైట్ అన్నారు.నిర్మాత సంజన కలివెల మాట్లాడుతూ.... ఈనెల ఆఖరునుంచి భీమవరం, నర్సాపురం, అంతర్వేది పరిసర ప్రాంతాలలో ఏకాదాటి గా 34 రోజుల్లో షూటింగ్ పూర్తిచేస్తామన్నారు. హీరో విశ్వ మాట్లాడుతూ... నా మొదటి సినిమాకె ఇలాంటి యాక్టింగ్ స్కోప్ ఉన్న కథ రావటం అదృష్టంగా భావిస్తున్నాను. హీరోయిన్ ఐశ్వర్య మాట్లాడుతూ... ఈసినిమాలో నేను మీ పక్కింటి అమ్మాయిలా గ్లామర్ గా కనిపిస్తాను.హీరోయిన్ అనూష మాట్లాడుతూ... ఈచిత్రంలో నేను ప్లే చేసే రోల్ అందరికి నచుతుందిన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ వర్ధన్ మాట్లాడుతూ... నాలుగు పాటలు రికార్డింగ్ పూర్తిచేశాం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కి కూడా మంచి స్కోప్ ఉన్న చిత్రమని అన్నారు.ఇంకా అమిత్ తివారి, శుభలేఖ సుధాకర్, శివ ప్రసాద్

## ఐదేళ్లుగా ఆ పని నేనే చేసుకుంటున్నాను..
## ఒక్కసారి కూడా సెలూన్‌కు వెళ్లలేదు: శ్రుతి హాసన్



నటి శ్రుతి హాసన్ తన ఫ్యాషన్, జీవనశైలితో ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తారు. తాజాగా ఆమె తన జుట్టు సంరక్షణ గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచారు. గత ఐదేళ్లుగా తాను కనీసం హెయిర్ సెలూన్‌కు కూడా వెళ్లలేదని, తన జుట్టును తానే కత్తిరించుకోవడంతో పాటు అవసరమైన ట్రీట్‌మెంట్ కూడా ఇంట్లోనే చేసుకుంటానని వెల్లడించారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శ్రుతి, 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. మీ పొడవైన, నల్లని జుట్టు సౌందర్య రహస్యం ఏంటి? సెలూన్‌కు ఎంత తరచుగా వెళ్తారు? అని అడగ్గా, శ్రుతి ఏమాత్రం దాచుకోకుండా సమాధానమిచ్చారు. "నేను సెలూన్‌కు వెళ్లి దాదాపు ఐదేళ్లయింది. చివరిసారిగా 2017లో నా జుట్టుకు రంగు వేశాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి హెయిర్ కలర్ ఉపయోగించలేదు. నా జుట్టును నేనే కత్తిరించుకుంటాను, ట్రీట్‌మెంట్ కూడా నేనే చేసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. గ్లామర్ ప్రపంచంలో సెలబ్రిటీలు ఎప్పుడూ తమ బ్యూటీషియన్లు, హెయిర్ స్టైలిస్టులతో బిజీగా ఉంటారు. అలాంటిది 'సలార్' వంటి భారీ చిత్రాల్లో నటించిన శ్రుతి... ఏడేళ్లుగా హెయిర్ డైకి, ఐదేళ్లుగా సెలూన్‌కు దూరంగా ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొందరు అభిమానులు ఆమె నిజాయతీని మెచ్చుకోగా, మరికొందరు ఇంత బిజీగా ఉండి కూడా ప్రొఫెషనల్స్ సహాయం లేకుండా ఎలా మేనేజ్ చేస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, శ్రుతి నిర్ణయం వెనుక కేవలం సౌలభ్యం మాత్రమే కాదు, ఒక బలమైన ఫిలాసఫీ కూడా ఉంది. ఆమె ఎప్పటినుంచో స్వీయ సంరక్షణ, మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడుతూ ఉంటారు. తన ఫ్యాషన్, సంగీతం, ఫిట్‌నెస్ ఇలా ప్రతి విషయంలోనూ ఇతరుల ఆమోదం కన్నా తన సహజత్వానికే ప్రాధాన్యం ఇస్తారు. రసాయనాలతో కూడిన ట్రీట్‌మెంట్లు, సెలూన్లకు దూరంగా ఉండటం కూడా ఆమె జీవనశైలిలో భాగమే. సెలబ్రిటీల బ్యూటీ రొటీన్లు చాలా ఖరీదైనవి, సామాన్యులకు అందుబాటులో ఉండవనే అభిప్రాయం ఉంది. కానీ, శ్రుతి హాసన్ ఐదేళ్లుగా సెలూన్‌కు వెళ్లకుండానే అందమైన జుట్టును కాపాడుకోవడం ద్వారా ఒక కొత్త సందేశాన్ని ఇచ్చారు. మంచి జుట్టు కోసం ఖరీదైన ఉత్పత్తులు, నిపుణుల బృందం అవసరం లేదని, క్రమశిక్షణతో కూడిన సంరక్షణ ఉంటే చాలని ఆమె నిరూపించారు. గతంలో కూడా అభిమానుల కోసం తాను ఇంట్లో తయారుచేసుకునే హెయిర్ ఆయిల్ రెసిపీని ఆమె పంచుకున్న విషయం తెలిసిందే.

## స్టూడెంట్" మూవీ ఫస్ట్ లుక్
# పోస్టర్ రిలీజ్



స్వర్గీయ రియల్ స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "స్టూడెంట్". ఈ సినిమాలో విజేత పరీక్ హీరోయిన్ గా నటిస్తోంది. జోవికా సినిమాస్, చెరిష్ మీడియా వర్క్స్ బ్యానర్స్ పై బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లం సంగీత, బెల్లం బయ్యారెడ్డి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు.ఈ రోజు "స్టూడెంట్" సినిమా నుంచి పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో మేఘాంశ్ శ్రీహరి ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నారు. పవర్ స్టార్ సినిమాకు బ్యానర్స్ కట్టడం, జామెట్రీ బాక్స్ లోని డివైడర్ ను క్లాస్ లో కాకుండా ఫైట్స్ కు ఉపయోగించడం, కాల్చిన సిగరెట్, అందంగా లవ్ లెటర్స్ రాయడం..ఇలా స్టూడెంట్ లో లైఫ్ లో భాగమైనవన్నీ ఈ పోస్టర్ లో కనిపించి ఆకట్టుకుంటున్నాయి. 'ధైర్యం ఉన్నవాడే తన వెంట అందరూ నడిచేలా చేసుకుంటాడు' అని రాసిన కొటేషన్ హీరో డేరింగ్ క్యారెక్టర్ ను రిఫ్లెక్ట్ చేస్తుండగా.. 'ఈ భాను గాడు అంతా చూసుకుంటాడు, నువ్వు లవ్ చేయి, తన్మయ్ లవ్స్ భాను..' అని రాసిన మాటలు ఈ స్టూడెంట్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ డ్రామాలో ఉన్న పవర్ ఫుల్ లవ్ స్టోరీని చూపిస్తున్నాయి."స్టూడెంట్" సినిమా మేఘాంశ్ శ్రీహరి కెరీర్ కు ల్యాండ్ మార్క్ మూవీగా రాబోతుందనే అంచనాలు ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.నటీనటులు – మేఘాంశ్ శ్రీహరి, విజేత పరీక్, తదితరులు

# రంగంలోకి 'ఎల్లమ్మ'



తెలంగాణ గ్రామదేవతల నేపథ్యంలో ఆధ్యాత్మిక, మార్మిక అంశాల కలబోతగా రూపొందిస్తున్న డివైన్ ఎంటర్‌టైనర్ 'ఎల్లమ్మ' రెగ్యులర్ షూటింగ్ సోమవారం హైదరాబాద్ నగర శివారులో మొదలైనట్లుగా సమాచారం. 'బలగం' వంటి ప్రశంసాత్మక చిత్రం తర్వాత దర్శకుడు వేణు యెల్దండి రూపొందిస్తున్న ఈ సినిమా నిర్మాణ దశలోనే ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఈ సినిమా ద్వారా ప్రముఖ సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ కథానాయకుడిగా పరిచయమవుతున్న విషయం తెలిసిందే. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అగ్ర నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఫస్ట్‌గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో ఈ సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రకాష్‌రాజ్‌తో పాటు కొందరు ప్రధాన తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కిస్తున్నారని, దేవిశ్రీప్రసాద్ త్వరలో ఈ షెడ్యూల్‌లో జాయిన్ అవుతారని తెలిసింది. ఈ సినిమాలో కథానాయికను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది.

## సౌత్ సినిమా ఓటీటీలో మహి వి రాఘవ్
# 'సేవ్ ది టైగర్స్ సీజన్ 3' నయా ట్రెండ్




ఆనందో బ్రహ్మ, యాత్ర సినిమాలతోపాటు సైతాన్, సేవ్ ది టైగర్స్ ఫ్రాంచైజీతో సక్సెస్‌ఫుల్ ట్రాక్‌లో దూసుకెళు తున్నాడు మహి వి రాఘవ్ (ప్రదీప్ అద్వైతం, మహి వీ రాఘవ్ క్రియేషన్‌లో సీజన్ 3ని శ్రీరామ్ ఎరగం డైరెక్ట్ సిరీస్ సేవ్ ది టైగర్స్ సీజన్ 3). ఈ సిరీస్ పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం జియో హాట్ స్టార్‌లో జూన్ 19 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. కాగా మొదటి రెండు సీజన్ల మాదిరిగానే ఏ మాత్రం తగ్గేదేలే అంటూ మూవీ లవర్స్ ను ఎంటర్‌టైన్ చేస్తూ దూసుకెళ్తోంది.ప్రియదర్శి, వెన్నెల కిషోర్, జోర్దార్ సుజాత, కృష్ణ చైతన్య, దేవియాని శర్మ, అభినవ్ గోమటం, పావని గంగిరెడ్డి, కామాక్షి భాస్కర్ల అండ్ టీం అందిస్తున్న వినోదానికి ఓటీటీ మూవీ లవర్స్ ఫిదా అయిపోతున్నారు. సేవ్ ది టైగర్స్ టాప్ వ్యూయర్ షిప్ సాధించి సౌతిండియాలో బిగ్గెస్ట్ డిజిటల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. సీజన్ సీజన్‌కు క్రేజ్‌ను పెంచేస్తూ షోరన్నర్‌గా నిలుస్తున్నాడు మహి వీ రాఘవ్. ఓ స్టోరీని కమర్షియల్‌గా, ఇంప్రెసివ్‌గా రూపొందించడం అంత సులభమేమి కాదు.. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయడంలో మహి సక్సెస్ అయ్యారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎంటర్‌టైన్ మెంట్ వాల్యూను ఏ మాత్రం తగ్గించకుండా ఒక ఫ్రాంచైజీని ఎంత స్ట్రాంగ్‌గా నడిపించాలో మరోసారి సీజన్ 3తో నిరూపిస్తున్నాడు మహి వి రాఘవ్. ఇండియాలో టెలివిజన్ సిరీస్‌లకు మన ఆడియెన్స్ ఇంకా అలవాటు పడలేదు. అందుకే మన దగ్గర ఓటీటీ కల్చర్ ఇంకా పూర్తిగా డెవలప్ కాలేదని మహి వి రాఘవ్ ఓ చిట్ చాట్‌లో చేసిన కామెంట్స్.. అమెరికన్, కొరియన్ టీవీ లాంటి బలమైన సంప్రదాయం లేని ఈ ఫార్మాట్‌లో కొత్తదనం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్టు చెప్పకనే చెబుతున్నాయి.

### క్రైమ్ కంట్రోల్, రికార్డుల నిర్వహణలో

# అప్రమత్తంగా ఉండాలి

- జాతీయ రహదారి 44 పై ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- రాజాపూర్ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మహబూబ్ నగర్ (భారత శక్తి)**వార్షిక తనిఖీలలో భాగంగా మహబూబ్నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్ స్టేషన్ను జిల్లా ఎస్పీ డి.జానకి, తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ నిర్వహణను, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న క్రైమ్ వివరాలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి వ్యక్తికి పోలీసులపై నమ్మకం పెరిగేలా సేవలు అందించాలని సూచించారు.స్టేషన్ పరిసర ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అన్ని రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమై వారి శాఖాపరమైన అవసరాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.అలాగే పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులను సక్రమంగా రిసీవ్ చేసుకుని మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యలను పూర్తిగా విని చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకుని త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా సేవాభావంతో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఇన్స్పెక్టర్/ఎస్హెచ్వో) స్టేషన్ పరిధిలో జరిగే ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సిబ్బందితో సమన్వయం పెంచుకొని సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్, రాజాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మొహరం పండుగను

## శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట(భారత శక్తి)** నారాయణపేట జిల్లా ప్రజలందరూ మొహరం పండుగను పరస్పర గౌరవం, సోదరభావం, సామాజిక సామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... మొహరం పండుగ సందర్భంగా సోషల్ మీడియా వేదికలైన ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్), వాట్సాప్ తదితర మాధ్యమాలలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు, మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసే వీడియోలు, ఫోటోలు లేదా సందేశాలను పోస్ట్ చేయడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఇతర మతాలు, వర్గాలు లేదా వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్న పోస్టులు చేసిన వారిపైన, వాటిని షేర్ చేసిన వారిపైన, అవసరమైతే సంబంధిత గ్రూప్ అడ్మిన్లపైన కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. మొహరం పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమైన ప్రార్థనా స్థలాలు, పీర్ల చావిడీలు, ఊరేగింపు మార్గాల వద్ద పోలీసు బలగాలు మోహరించబడతాయని పేర్కొన్నారు.సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడిందని, 24 గంటల పాటు సైబర్ మానిటరింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద పోస్టులు, విద్వేషపూరిత సందేశాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్కు 8712670399 కి సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ లేని సమాచారాన్ని ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖకు సహకరించి మొహరం పండుగను విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు

## శిశు మందిర్ పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం




**కరీంనగర్ (భారత శక్తి):**అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. సుమన్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి ఆయన వివరించారు. నేటి సమాజంలో వివిధ రూపాల్లో మత్తు పదార్థాలు ఎలా అందుబాటులోకి వస్తున్నాయో, వాటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. తమ పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిసినప్పుడు పోలీసులకు ఎలా సమాచారం అందించాలో విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, చిన్న కూల్డ్రింక్స్, జంక్ఫుడ్ వంటి అలవాట్లతో ప్రారంభమయ్యే అనారోగ్యకర జీవనశైలి క్రమంగా మత్తు పదార్థాల వైపు దారితీసే ప్రమాదం ఉందని వివరించారు. ప్యాకేజ్డ్ ఫుడ్, జంక్ఫుడ్కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మంచి స్నేహాలు, సానుకూల ఆలోచనల ద్వారా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను జీవితానికి దూరంగా ఉంచుకోవచ్చని తెలిపారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరితో "ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు అలవాటు పడబోమని, వాటి బారిన పడకుండా తమను తాము కాపాడుకుంటామని" ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందనీ, డాక్టర్ నాళ్ల సత్యవిద్యాసాగర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్,పులల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకుల దేవి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### దెందులూరు నియోజకవర్గంలో

# ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.
- జల జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో రూ. 10 కోట్ల రూపాయలు పైగా నిధులతో 43 త్రాగునీటి పనులకు శ్రీకారం.
- ఇప్పటికే శరవేగంగా పూర్తయిన 34 పనులు.. పురోగతిలో మిగిలిన పనులు..
- రాబోయే రోజుల్లో గ్రామ గ్రామాన ఇంటి ఇంటికీ నల్లా కనెక్షన్ ద్వారా రక్షిత మంచినీటి సరఫరా:
- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని వెల్లడి.

**దెందులూరు, జూన్ 23(భారత శక్తి):**గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య భద్రతకు, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, సురక్షితమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) మరియు జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకాల ద్వారా పలు తాగునీటి ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందని తెలిపారు.దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు , అధికారులు ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను పలు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారు సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రెండేళ్లలో రూ. 10 కోట్ల పైగా నిధులతో త్రాగునీటి అభివృద్ధి పనులు:ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్రు మాట్లాడుతూ.. దెందులూరు నియోజకవర్గంలోనీ గ్రామాల్లో సురక్షిత త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో జల జీవన్ మిషన్ ద్వారా రూ. ××10 కోట్ల రూపాయల పైగా భారీ నిధులను వెచ్చించిందని తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గవ్యాప్తంగా పలు ఓహెచ్ఆర్ఎస్ ల నిర్మాణాల సహా వివిధ గ్రామాల్లో 43 నూతన త్రాగునీటి పనులను చేపట్టడం జరిగిందన్నారు.

ప్రజలకు త్వరితగతిన మంచినీటి సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించామని, అందువల్లనే ఇప్పటికే 34 పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు..మిగిలిన పనులు కూడా ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని, వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు

.భవిష్యత్తులో ప్రతి ఇంటికీ రక్షిత జలం:రాబోయే రోజుల్లో జల జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గానికి మరిన్ని నిధులు రాబట్టి, మరిన్ని సరికొత్త అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామ గ్రామాన, ప్రతి నిరుపేద ఇంటికీ సురక్షితమైన త్రాగునీటిని నల్లా కనెక్షన్ల ద్వారా అందించి, మంచినీటి కోసం మహిళలు పడుతున్న ఇబ్బందులను పూర్తిగా దూరం చేస్తామని చింతమనేని ప్రభాకర్రు స్పష్టం చేశారు.

# బూతు సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- మంత్రి కందుల దుర్గేష్
- కూటమి ఐక్యతను చూసి ఓర్వలేకనే వైసీపీ రాజకీయ ముసుగు లాటలు
- సాయికృష్ణ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతోంది:
- నిందితుడైన సీఐ నాగరాజు సస్పెన్షన్, సిట్ విచారణ ముమ్మరం
- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కుల చట్రంలో బంధించాలని చూస్తే ప్రజలు బుద్ధి చెప్తారు.
- రాజకీయ లబ్ధి కోసం కులాల మధ్య చిచ్చు పెట్టడమే వైసీపీ నైజం
- కాపు సంక్షేమాన్ని తుంగలో తొక్కిన చరిత్ర మీది కాదా?..

**(భారత శక్తి)** గత ఐదేళ్ల పాలనలో కాపులకు చేసిన సంక్షేమంపై గణాంకాలు ఉంటే చూపించండి అంటూ మంత్రి దుర్గేష్ రాజకీయ నాయకుల ప్రవర్తనా నియమావళి మరియు నైతిక విలువల గురించి విపక్ష వైసీపీ నేతల నుండి నేర్చుకోవాల్సిన దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర రాజకీయం లేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నేతల వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.విలువల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు:మంత్రి దుర్గేష్గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలు ప్రదర్శించిన అసభ్యకర సంస్కృతిని మంత్రి దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి, నాటి సీఎం చంద్రబాబు నాయుడుని నడిరోడ్డుపై ఉరితీయాలని చేసిన వ్యాఖ్యలను ఆదర్శంగా తీసుకోవాలా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వంటి నేతలు సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాతృమూర్తిపై చేసిన వ్యక్తిగత, అసభ్యకర దూషణలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. రాజకీయాల్లో విలువల్లేని వ్యవస్థను పెంచి పోషించిన పార్టీ వైసీపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

సాయికృష్ణ కేసులో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది:

**మంత్రి దుర్గేష్**

సాయికృష్ణ అదృశ్యం కేసులో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా వ్యవహరిస్తోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. కేసు తీవ్రతను బట్టి నిందితుడైన సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నేతృత్వంలో విచారణాధికారిని నియమించడమే కాకుండా, లోతుగా దర్యాప్తు చేయడానికి ప్రత్యేక విచారణ బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశామన్నారు. సిట్ అధికారులు ఇప్పటికే సీఐ నాగరాజును అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు:మంత్రి దుర్గేష్సాయికృష్ణ కేసును అడ్డం పెట్టుకొని ద్రాక్షారామం, కాకినాడల్లో వైసీపీ నేతలు కులాల పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమాజంలో విభజన తేవాలని చూస్తున్నారని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా దానికి కులం రంగు పూసి రాజకీయ లబ్ధి పొందడమే ధ్యేయంగా వైసీపీ దిగజారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం తప్పు చేస్తే నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలే తప్ప, ప్రతి అంశంలోనూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని లాగి, ఆయనను ఒక కులానికి పరిమితం చేయాలని చూస్తే ప్రజలు క్షమించరన్నారు. "తాను పుట్టిన కులం పట్ల గౌరవం ఉన్నప్పటికీ, రాజకీయంలో ఉన్న వ్యక్తిగా అన్ని కులాలను సమానంగా చూస్తానని, అందరి అభివృద్ధికి పాటుపడతానని జనసేనాని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆయన ఉన్నత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదం."అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు.కూటమి బలపడుతుందనే భయం వైసీపిది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇలాగే బలంగా ఉంటే భవిష్యత్తులో తాము ఎప్పటికీ అధికారంలోకి రాలేమని, రాజకీయ నిరుద్యోగులుగా మిగిలిపోతామనే భయంతోనే వైసీపీ నేతలు ఈ విధమైన ఉన్మాద తాండవాలు చేస్తున్నారని మంత్రి దుర్గేష్ ఎద్దేవా చేశారు.

### పాతబస్తీలో

# భారీ నగదు చోరీ

**- ఏటీఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ నిర్వాకం**

**హైదరాబాద్ (భారత శక్తి)**హైదరాబాద్ పాతబస్తీలో రూ.17 లక్షల భారీ చోరీ జరిగింది. ఏటీఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ నగదు తో పరార్ అయ్యాడు. నోట్ల కట్టలతో ఉన్న ట్రంక్ బాక్స్ నుంచి నగదు మాయం చేసాడు. ముందే పిలిపించుకున్న బైక్పై నిందితుడు పరారీ అయ్యాడు. పక్కా స్కెచ్తో చోరీ చేసినట్లు పోలీసుల అనుమానం. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. చార్మినార్ జోన్ డిసిపి కారే కిరణ్ ప్రభాకర్ ఆధ్వర్యంలోప్రత్యేక బృందాల గాలింపు కొనసాగిస్తున్నారు. డ్రైవర్కు సహకరించిన వ్యక్తుల కోసం వేట కొనసాగుతుంది. రూ.17 లక్షల చోరీ చేసి పరారైనట్లు గుర్తించారు.

## మాజీ సర్పంచ్ బలవన్మరణం

**సిద్దిపేట(భారత శక్తి)** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు రూ.11 లక్షలు పెట్టి గ్రామంలో సంపత్ పలు అభివృద్ధి పనులు చేసాడు. అధికారుల చుట్టూ ఎంత తిరిగినా బిల్లులు విడుదల కాకపోవడం, అప్పులకు మిత్తి పెరగడంతో మనస్తాపానికి గురై సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడు. బిల్లులు విడుదల చేయకపోవడంతో అప్పుల బాధతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపించారు.

# రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

**తిరుపతి(భారత శక్తి)** తిరుపతి జిల్లా రేణిగుంటలో దారుణ ఘటన జరిగింది. మూడు పెళ్లీళ్ల మహిళ ట్రాప్లో పడి రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. మహిళా సంఘం నాయకురాలు ఉషారాణి వేధింపులు భరించలేక రైల్వే ఉద్యోగి రవి ఆత్మహత్య చేసుకున్నాడు. రేణిగుంట బుగ్గ వీధిలో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మూడు పెళ్లిళ్లు చేసుకుని, మహిళ సంఘం ముసుగులో రైల్వే ఉద్యోగి రవిని ట్రాప్ చేసింది ఉషారాణి.

తూర్పుగోదావరి జిల్లా కడియంకు చెందిన రవితో మూడేళ్ళు సహజీవనం చేసింది ఉషారాణి. మూడు పెళ్లిళ్లు విషయం తెలుసుకుని రవి జాగ్రత్త పడ్డాడు. రైల్వే సర్వీస్ రికార్డులో తన పేరు నామినిగా పెట్టాలని, రూ.కోటి ఇన్సూరెన్స్ పాలసీ నామినిగా పెట్టాలని ఉషారాణి వేధించినట్లు సామాచారం. ఉషారాణి వేధింపులుపై రేణిగుంట పోలీసులకు రైల్వే ఉద్యోగి రవి ఫిర్యాదు చేసాడు. మహిళా సంఘం, సీపీఐ నాయకులతో రాజీ చేసుకోవాలంటూ పోలీసుల సలహా ఇచ్చినట్టుగా రవి తెలిపాడు. ఈరోజు మధ్యాహ్నం రేణిగుంట బుగ్గవీధిలో రవి ఆత్మహత్య చేసుకున్నాడు. మ్యాట్రిమోనిలో మరోసారి పెళ్లికి ఉషారాణి ఆన్లైన్ గాలం వేసింది.

ఉషారాణి గుట్టు మొత్తం సేకరించి పోలీసులకు ఇచ్చినా పట్టించుకోకపోవడం లేదని మనస్తాపంతో రవి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉషారాణి వేధింపులు వల్లే ఆత్మహత్యకు పాడినట్లు సూసైడ్ నోట్ రాసి చనిపోయాడు. సూసైడ్ నోట్ లో తనపై తప్పుడు కేసులతో ఉషారాణి వేధింపులపై వివరంగా రాసాడు.

## పాఠశాలల ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించేలా అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ చేపట్టాలి

- పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**జూపాడుబంగ్లా/నంద్యాల, జూన్ 23 (భారత శక్తి)**జిల్లాలో చేపడుతున్న హరితాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసి, విద్యాసంస్థల ఆవరణలను పచ్చదనంతో నింపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం జూపాడుబంగ్లా మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా విద్యాసంస్థల ప్రాంగణాల్లో చేపట్టిన అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి, మొక్కల పెంపకం, సంరక్షణ, నీటి వసతి, వాటి పెరుగుదల స్థితి తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాసంస్థలో అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ కింద జరుగుతున్న ఉద్యానవన అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాటిన మొక్కల నిర్వహణ, ప్రాంగణ సుందరీకరణ, పచ్చదనం విస్తరణకు చేపడుతున్న చర్యలను పరిశీలించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పాఠశాలల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించవచ్చని కలెక్టర్ తెలిపారు. అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ విధానంలో తక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచే అవకాశం ఉండటంతో పచ్చదనం వేగంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్క జీవించి ఎదిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మొక్కల సంరక్షణ బాధ్యతను పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వామ్యంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ భాగస్వాములు కావాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో పర్యావరణహిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణపై బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతుందని కలెక్టర్ తెలిపారు.అనంతరం గురుకుల విద్యాసంస్థలోని డైనింగ్ హాల్ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ మరియు సిబ్బందికి సూచించారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గంలో యూరియా కొరత లేదు.

## -రైతులకు అవసరమైన ఎరువులు అందిస్తాం : ఎమ్మెల్యే మదన్ మోహన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 23: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో యూరియా పంపిణీకి సంబంధించి కొన్ని తాత్కాలిక ఇబ్బందులు ఏర్పడిన విషయం నా దృష్టికి వచ్చిందని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నారు. విషయం తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని పర్యవేక్షించాను. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, నా కార్యాలయ సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టారు. తాడ్వాయి మండలంలోని ఒక పిఏసిఎస్ ద్వారా యూరియా కొనుగోలు ప్రక్రియలో జరిగిన ఆలస్యం కారణంగా పంపిణీలో అంతరాయం ఏర్పడే పరిస్థితి వచ్చింది. అయితే అధికారులు వెంటనే అప్రమత్తమై అవసరమైన చర్యలు తీసుకుని యూరియా లోడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా పరిశీలించాము. అవసరమైతే ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా పంపిణీ చేసే అవకాశాలను కూడా పరిశీలించాము. అయితే ఆ విధానంలో అదనపు రవాణా, లేబర్ ఖర్చులు రైతులపై భారం పడే అవకాశం ఉండటంతో రైతులకు అదనపు వ్యయం లేకుండా పరిష్కారం చూపేందుకు కృషి చేశాము. దీంతో పిఏసిఎస్ పరిధిలో ఇలాంటి సమస్య తలెత్తినప్పుడు కూడా వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పిఏసిఎస్ పరిధిలోని గోదాముల ద్వారా యూరియా సరఫరాను మరింత సులభతరం చేసే అంశంపై కూడా అధికారులతో చర్చలు జరుగుతున్నాయి. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. దేశవ్యాప్తంగా యూరియా సరఫరాపై ఒత్తిడి ఉన్నప్పటికీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ రైతులకు అవసరమైన యూరియా అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంది. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అవసరమైన మేర యూరియాను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం మరియు వ్యవసాయ శాఖ నిరంతరం కృషి చేస్తున్నాయి. ఈరోజు నేను గర్వంగా చెప్పగలను. వ్యవసాయ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం కామారెడ్డి జిల్లాలో రైతులకు యూరియా సరఫరాలో గాంధారి మండలం మొదటి స్థానంలో ఉండగా, సదాశివనగర్ మండలం నాలుగో స్థానంలో ఉంది. ఈ రెండు మండలాలు కూడా ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలో ఉండటం రైతులకు ఎరువులు అందించడంలో మేము ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో చెప్పడానికి నిదర్శనం. యూరియా పంపిణీ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌పై కొందరు అనవసర అపోహలు సృష్టిస్తున్నారు. రైతులకు నేరుగా, పారదర్శకంగా యూరియా అందించడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశ్యం. రైతు పేరుతో బుకింగ్ అయితే రైతుకే యూరియా అందే విధంగా వ్యవస్థను రూపొందించారు. దీనివల్ల అక్రమ మళ్లింపులు, మధ్యవర్తుల జోక్యం, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతోంది. కొత్త సాంకేతిక విధానాలకు అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది. ఒకప్పుడు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ సేవలు కూడా కొత్తగానే అనిపించాయి. నేడు ప్రతి ఒక్కరూ వాటిని వినియోగిస్తున్నారు. అదే విధంగా రైతులు కూడా ఈ వ్యవస్థకు అలవాటు పడతారు. యాప్‌లో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోంది. రైతులకు మరింత సౌకర్యంగా సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు కూడా చేపడుతోంది. రైతుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా పరిష్కార దృక్పథంతో చూడాలని నేను ప్రతి ఒక్కరిని కోరుతున్నాను. రైతులకు సేవ చేయాల్సిన బాధ్యత అందరిదీ. రైతులను ఆందోళనకు గురిచేసే ప్రచారాల కంటే సమస్యలను పరిష్కరించే ప్రయత్నాలు జరగాలి. నేను ఎప్పుడూ రైతు పక్షానే నిలబడ్డాను. తాడ్వాయి మండలంలో రెండోసారి మొక్కజొన్న కొనుగోలు జరిగేలా కృషి చేశాను. జొన్నల కొనుగోలు కేంద్రాల కోసం పోరాడాను. ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేందుకు రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాను. ఎల్లారెడ్డి రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి పైలట్ ప్రాజెక్టును తీసుకువచ్చి రీ-సర్వే జరిగేలా కృషి చేశాను. అసెంబ్లీలో కూడా అనేకసార్లు ఎల్లారెడ్డి రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాను. "రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది" అనే నమ్మకంతోనే నేను పనిచేస్తున్నాను. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఒక్క రైతు కూడా యూరియా కోసం ఇబ్బంది పడకుండా చూడటం నా బాధ్యత. రైతులకు అవసరమైన యూరియా అందే వరకు నేను వ్యక్తిగతంగా పరిస్థితిని పర్యవేక్షిస్తాను. అందరికి యూరియా తప్పకుండా అందుతుందని తెలుపుతున్నానని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు.

# నర్సాపూర్ నూతన సీఐ రంగాకృష్ణను ఘనంగా సన్మానించిన నర్సాపూర్ బీజేపీ నాయకులు

**-మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్ర గొల్లమురళి**

**-మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్**




నర్సాపూర్, జూన్ 23,(భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రంగాకృష్ణను నర్సాపూర్ బీజేపీ రథసారథులు నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రగుళ్ల మురళి, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మాజీ సర్పంచ్ రమణ రావు,కౌన్సిలర్ శ్రీకాంత్, లు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం,నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేయాలని నాయకులు ఆకాంక్షించారు. నర్సాపూర్ అభివృద్ధి, ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖతో కలిసి సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రంగాకృష్ణ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకమైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తానని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.


## భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఘన నివాళులు.



మెదక్ జిల్లా నర్సాపూర్, జూన్ 23 (భారత శక్తి న్యూస్): నర్సాపూర్ పట్టణంలోని బీజేపీ ఆఫీస్ లో "ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా" అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ప్రాతఃస్మరణీయులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివస్ సందర్భంగా నర్సాపూర్ బిజెపి నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నర్సాపూర్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి బాదే బాలరాజు, జిల్లా ఒబీసీ మోర్చా గుండం శంకర్, పట్టణ అధ్యక్షులు వీరుడు చంద్రయ్య, ప్రధాన కార్యదర్శులు సంఘసాని రాజు, బోర్వెల్ రాంరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మన్నె దిగంబర్, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు. బుచ్చేష్ యాదవ్, పాపగారి రమేష్ గౌడ్, సంగసాని సురేష్ మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదమే పునాదిగా.. భారతీయ సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా.. భారతీయ జన సంఘ్ ను స్థాపించిన మార్గదర్శి అఖండ భారతమే ఆదర్శంగా దేశ ప్రజల సంఘటితమే సిద్ధాంతంగా పనిచేసిన కర్మశీలి.. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహి చలేగా అని నినదించిన ధైర్యశాలి.. పటిష్ట జాతీయ భావజాల నిర్మాణమే పరమావధిగా తన జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్యచైతన్యశీలి డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా ఆ మహోనీయునికి వినమ్ర ఘటిస్తున్నామన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**- ఎస్సై ప్రశాంత్ రెడ్డి**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 23: కోనరావుపేట మండల కేంద్రం మర్రి సమీపంలో ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి తనిఖీలు చేయడంతో పాటు వారికి రోడ్డు భద్రత నిబంధనలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ప్రాణాలు నడిరోడ్డుపై బలికాకుండా ఉండాలంటే మద్యం సేవించి ఎవరూ వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమాలలో ఏఎస్ఐ తిరుమల బాబుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి ) జిల్లాలో అన్ని శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా జిల్లాలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, శాఖలు, ఏజెన్సీలు సమర్పించిన ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే ఏజెన్సీలు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లోకి జీతాలు జమ చేయాలన్నారు. వేతనాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎఫ్ డబ్బులను సకాలంలో జమ చేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన పోస్టులను నియమ నిబంధనల ప్రకారం, పారదర్శకంగా భర్తీ చేయాలని చెప్పారు. ఉద్యోగుల వివరాల వెల్లడింపులో ఆలస్యం చేయకూడదన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఔట్సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన ములుగు జిల్లా

## ప్రత్యేక అధికారి హనుమంత్ కె. జండాగే





ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 23 (భారత శక్తి): ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ములుగు జిల్లా విశిష్ట ఫలితాలు సాధించి, వినూత్న మైన కార్యక్రమాలు, ఉత్తమ విధానాల అమలుతో ములుగు జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి హనుమంత్ కె.జండాగే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలో గత 99 రోజుల కాలంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన పురోగతి, శాఖల వారీ విజయాలు, అమలు చేసిన వినూత్న కార్యక్రమాలపై మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి హనుమంతు కే. జండాగే ములుగు జిల్లా కలెక్టర్ వర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అన్ని శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజావాణి, గ్రామసభల ద్వారా అందిన భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించిన వివరాలు తెలిపారు. ఫైల్ క్లియరెన్స్, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య సేవలు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాలో గణనీయమైన పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో ములుగు జిల్లా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విశిష్ట ఫలితాలు సాధించిందన్నారు. ప్రజలకు నేరుగా చేరువయ్యే విధంగా ప్రభుత్వ పరిపాలనను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని అభినందించారు. జిల్లాలో గత 99 రోజులలో చేపట్టిన కార్యక్రమాల అమలును శాఖల వారీగా సమీక్షిస్తూ, ఇప్పటికే సాధించిన లక్ష్యాలతో పాటు ఇంకా పూర్తికాని అంశాలను గుర్తించి, వాటి పూర్తి కోసం సంబంధిత అధికారులు సమిష్టిగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రతి శాఖ అమలు చేసిన కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరిందని తెలిపారు. సమీక్షలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల గ్రామసభలు, బాల్య వివాహాల నిరోధానికి చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా వారోత్సవాలు, విద్యార్థులకు అందించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన శిక్షణ, మహిళా సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా జిల్లాలో మహిళలు సాధించిన విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యాల కల్పన, ఆయిల్ పామ్ సాగు కోసం అర్హులైన రైతుల గుర్తింపు, కొత్త విద్యా సంవత్సరానికి పాఠశాలల సన్నద్ధత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, మహాలక్ష్మి, చేయూత, కొత్త రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాల అమలు, జిల్లాలో చేపడుతున్న వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని కూడా సవివరంగా సమీక్షించారు. సాధించిన విజయాలను సమగ్ర నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నామని, ఇంకా పెండింగ్‌లో ఉన్న లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో "ప్రగతి" అంటే అభివృద్ధి, "ప్రణాళిక" అంటే కార్యాచరణ అని పేర్కొంటూ, అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళికాబద్ధమైన పని విధానం అవసరమని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. అనంతరం విలేకరులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ములుగు జిల్లా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విశేష ఫలితాలు సాధించిందని ప్రత్యేక అధికారి హనుమంత్ కె. జండాగే, ఐఏఎస్ తెలిపారు. జిల్లాలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజలకు చేరే విధంగా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందన్నారు. ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువయ్యేలా సేవల అందింపు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, మహిళా సాధికారత, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలలో జిల్లాలో అమలు చేసిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటికే సాధించిన విజయాలను సమగ్రంగా నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తున్నామని, ఇంకా నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ఇదే సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ములుగు జిల్లా అమలు చేస్తున్న పలు వినూత్న కార్యక్రమాలు ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలిచే స్థాయిలో ఉన్నాయని ప్రత్యేక అధికారి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్‌వో వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జీ, డీఆర్వో రవికుమార్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టు రట్టు

**- సుమారు పది లక్షల విలువైన నకిలీ విత్తనాల పట్టివేత**

**- పోలీస్, వ్యవసాయ శాఖ సంయుక్త ఆపరేషన్ - నకిలీ విత్తనాలు వాడద్దని రైతులకు సూచించిన అధికారులు**






యాదాద్రి భువనగిరి జిల్లా , జూన్ 23 (భారత శక్తి ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి మండల కేంద్రంలో మంగళవారం పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. యాదాద్రి డివిజన్ ఎస్డిపిఓ శ్రీనివాస్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అక్షాంశ్ యాదవ్ ఐపిఎస్, అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో తుర్కపల్లి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తుర్కపల్లి బస్టాండ్ ముందర దొండపాటి మల్లికార్జునరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, అతను గుంటూరు నుండి సిద్దిపేటకు నిషేధిత బిజి-II పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించామన్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా అతడు చిత్తూరు జిల్లాకు చెందిన శంకర్‌తో కలిసి తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా నకిలీ బిజి-II పత్తి విత్తనాలను కొనుగోలు చేసి, రవాణా చేసి, విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు వెల్లడైందని తెలిపారు. ఈ సందర్భంగా నిందితులను ప్రశ్నించగా తాను రైతులకు అధిక దిగుబడి వస్తుందని, మంచి పంట ఉత్పత్తి కలుగుతుందని తప్పుడు ప్రచారం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు ఒప్పుకున్నాడని అన్నారు. వారి నుండి సుమారు పది లక్షల విలువైన మొత్తం ఐదు సంచుల్లో ఉన్న "బిల్లా బిజి-II 999" పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు--70 కిలోలు (2 సంచులు), విడిగా ఉన్న నకిలీ/కల్తీ పత్తి విత్తనాలు--80 కిలోలు (3 సంచులు) మొత్తం 150 కిలోలు కల్తీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న విత్తనాల నిల్వ, రవాణా మరియు విక్రయాలకు సంబంధించి నిందితుడి వద్ద ఎలాంటి చెల్లుబాటయ్యే లైసెన్స్, బిల్లులు, ఇన్వాయిస్‌లు, రవాణా అనుమతులు, స్టాక్ రిజిస్టర్లు లేదా అధికార పత్రాలు లేవన్నారు. ఘా1 దొండపాడి మల్లిఖార్జునరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, ఘా2 శంకర్ పరారీలోఉన్నాడని అతడిని పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై తాలంగాణ పత్తి విత్తనాల చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి నిషేధిత మరియు నకిలీ పత్తి విత్తనాల వినియోగం వల్ల విత్తనాల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు విఫలమవడం మరియు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చని కాబట్టి ఇలాంటి నకిలీ విత్తనాలు నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండవని, వ్యవసాయ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. ఇలాంటి విత్తనాల నిరంతర వినియోగం భూసారాన్ని దెబ్బతీయడమే కాకుండా నేల కాలుష్యానికి కూడా దారితీయవచ్చు. రైతులు అదనంగా పురుగుమందులు, ఎరువులు మరియు తిరిగి విత్తడం కోసం అధిక ఖర్చు చేయాల్సి రావడంతో సాగు వ్యయం పెరుగుతుంది. ఈ విధమైన అక్రమ కార్యకలాపాలు రైతు సమాజానికి మరియు వ్యవసాయ రంగానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. కావున రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు భారీ ఆర్థిక నష్టాలు కలిగించే నకిలీ విత్తనాల వ్యాపారాన్ని అరికట్టేందుకు పోలీసులి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని, నకిలీ విత్తనాల తయారీ, రవాణా మరియు విక్రయాల్లో పాల్గొంటున్న ముఠాలను గుర్తించి నిర్మూలించేందుకు నిరంతర చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ అక్రమ కార్యకలాపాలలో పాల్గొనే ప్రతి ఒక్కరిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన స్పెక్టర్ ఎం శంకర్, తుర్కపల్లి ఎస్ఐ మొహమ్మద్ తకియుద్దీన్, తుర్కపల్లిమండలవ్యవసాయఅధికారికె ఉమ తదితరులు పాల్గొన్నారు

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy